ప్రజాశక్తి

మంగళవారం 14 నవంబర్ 2023

5

కర్నూలు

# బైజూస్ బోధనతో ఒరిగిందేమి

**- పనిచేయని ట్యాబ్‌లు - నిస్సహాయత వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు - ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వని విద్యాశాఖ**

**ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్**

రాష్ట్రంలోని జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేటీకరణకు దిశగా అడుగులు వేసింది. ఇందులో భాగంగానే నష్టాల్లో ఉన్న బైజూస్ సంస్థకు చెందిన కంటెంట్‌తో కూడిన బోధనను ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందించేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సంస్థకు చెందిన కంటెంట్‌తో కూడిన మెటీరియల్‌ను ప్రత్యేకంగా ట్యాబ్‌లలో అప్లోడ్ చేసి సరఫరా చేశారు. ఇప్పుడు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఇచ్చిన ట్యాబులు సరిగా పనిచేయడం లేదు. ఈ సంస్థకు సంబంధించిన మెటీరియల్‌తో బోధన కంటే ఉపాధ్యాయులకు మరింత నాణ్యమైన శిక్షణ ఇస్తే మెరుగైన విద్యాబోధన అందించేందుకు అవకాశం ఉంటుందని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. కర్నూలు జిల్లాలో గత ఏడాది డిసెంబర్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు, ఉపాధ్యాయులకు 32,011 ట్యాబ్ లను అందజేశారు. ఈ ట్యాబులు కూడా ఎలాంటి ఇంటర్నెట్ సౌకర్యంతో కూడినటువంటి అంశాలు చూడకుండా చర్యలు తీసుకున్నారు. కేవలం బైజుస్ సంస్థకు సంబంధించిన మెటీరియల్ మాత్రం అప్లోడ్ చేసి పంపారు. గత విద్యా సంవత్సరం నుండి ఇప్పటి వరకు ఆ సంస్థ సంబంధించిన మెటీరియల్‌తో ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారు. ఉపాధ్యాయులు వీటిని వినియోగించుకోకపోతే వెంటనే వారికి విద్యాశాఖ అధికారుల నుండి చార్జీ మెమోలు కూడా జారీ చేస్తున్నారు. తప్పనిసరిగా ప్రతి ఉపాధ్యాయుడు వీటిని వినియోగించాలని విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులకు ఇచ్చినటువంటి ట్యాబ్లు మాత్రం సరిగ్గా పనిచేయడం లేదు. కొంతమంది విద్యార్థులు బైజుస్ చెందిన మెటీరియల్ ను కూడా తీసివేసి రకరకాల యాప్ లను అప్లోడ్ చేశారు. అలాగే ఇటీవల డిజిటల్ బోర్డుల పేరుతో ప్రతి పాఠశాలకు విద్యాశాఖ అందజేసింది. ఈ డిజిటల్ బోర్డులో కూడా విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌కు సంబంధించిన బోధన చేస్తున్నారు. విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యను అందించాలంటే ఉపాధ్యాయులకు ఎక్కువగా శిక్షణ కార్యక్రమాలను నిర్వహించి ఇటీవల కాలంలో సబ్జెక్టులో వచ్చిన మార్పులకు అనుగుణంగా శిక్షణ ఇస్తే మెరుగైన బోధన ఇస్తారు. అలాంటి చర్యలు చేయకుండా ప్రభుత్వం ఓ కార్పొరేట్ సంస్థకు చెందిన మెటీరియల్‌ను తీసుకొని ఉపాధ్యాయులు ఆ మెటీరియల్ బోధన చేయాలని బలవంతంగా రుద్దడం పట్ల విద్యావేత్తలు మండిపడుతున్నారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన ప్రభుత్వ పాఠశాలలో అందించాలంటే ఉపాధ్యాయులను మరింత తర్ఫీదు ఇచ్చి ఉత్తమ ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని విన్నవిస్తున్నారు.

### బైజూస్ బోధన చేయాల్సిందే

**- జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట రంగారెడ్డి**

విద్యార్థులకు ఉపాధ్యాయులకు ఇచ్చిన ట్యాబ్‌లలో బైజుస్ సంస్థకు సంబంధించిన మెటీరియల్ అనుగుణంగా బోధన చేయాలి. ఎప్పటికప్పుడు ఉపాధ్యాయుల బోధనపై వివరాలను కూడా సేకరించడం జరుగుతుంది. ఏమైనా ట్యాబ్‌లలో రిపేర్లు ఉంటే తమ దృష్టికి తీసుకొని వస్తే వెంటనే రిపేరు చేస్తాం.

### కార్పొరేట్ బోధనకే అడుగులు

**- కే సురేష్ కుమార్, యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు**

ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ బోధనకే రాష్ట్రప్రభుత్వం బైజూస్ సంస్థతో ఒప్పందం చేసుకుంది. ఈ సంస్థతో అనుగుణంగా విద్యా బోధన చేయించాలని విద్యాశాఖ ఉపాధ్యాయులపై ఒత్తిడి చేయడం తగదు. ఉపాధ్యాయులకే మెరుగైన శిక్షణ ఇచ్చి బోధన చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలి.

# గుర్తింపునకు నోచని 'కౌలు'

**- రుణ అర్హత కార్డుల జారీలో జాప్యం - కౌలు రైతులకు అందని ప్రయోజనాలు**

**ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి**

**కౌలు రైతులు కనీసం గుర్తింపునకు కూడా నోచుకోవడం లేదు. కౌలు రైతులకు అందించాల్సిన రుణ అర్హత కార్డుల జారీలో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో ప్రభుత్వం నుంచి అందాల్సిన ప్రయోజనాలు కౌలు రైతులకు అందడం లేదు...**

వాస్తవ సాగుదారుడైన కౌలు రైతులను ప్రభుత్వం పట్టించుకోని పరిస్థితి నెలకొంది. '2019 పంట సాగుదారు హక్కుచట్టం' తెచ్చి కౌలురైతులకు ప్రభుత్వ సాయం ఏ ఒక్కటీ అందకుండా చేసింది. దీంతో కౌలురైతులు వ్యవసాయ సాగులో తీవ్రంగా నష్టపోతున్నారు. రెండు లక్షల మందికిపైగా కౌలురైతులు ఉమ్మడి జిల్లాలో ఉన్నారు. 2011 భూఅధీకృత సాగుదారుని హక్కు చట్టంతో కౌలు రైతులకు కొన్ని హక్కులు కల్పించారు. భూయజమానితో సంబంధం లేకుండా కౌలుకార్డు జారీచేసి బ్యాంకు రుణాల నుంచి ప్రభుత్వం అందించే ప్రతి సాయం కౌలురైతులకు అందేలా చట్టంలో పేర్కొన్నారు. దీంతో అధికారులు కౌలుకార్డులు ఇవ్వకపోతే రైతుసంఘాల ఆధ్వర్యంలో రైతులు రోడ్డెక్కి ఆందోళనలు నిర్వహించి సాధించుకునేవారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత 2011 కౌలుచట్టంలో ఏకపక్షంగా మార్పులు చేసేసింది. దాని స్థానంలో 2019 పంట సాగుదారు హక్కుచట్టం తెచ్చింది. ఈ చట్టంలో భూయజమాని అంగీకారం లేకుండా కౌలు రైతులకు సిసిఆర్‌సి(కౌలుకార్డు) ఇవ్వకూడదని తెలిపింది. సిసిఆర్‌సి కార్డు లేకుంటే బ్యాంకు రుణం నుంచి బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు భరోసాతో పాటు చివరికి ధాన్యం అమ్ముకునే పరిస్థితి కూడా కౌలు రైతులకు లేకుండాపోయింది. కౌలు కార్డులు కూడా అరకొరగా మంజూరు చేస్తున్నారు. కార్డులు ఇచ్చినవారికి కూడా బ్యాంకు రుణాలుగాని ప్రభుత్వ సాయం పూర్తిస్థాయిలో అందని పరిస్థితి నెలకొంది.

**పట్టించుకునేవారేరీ..**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 70శాతానికిపైగా వ్యవసాయ సాగు కౌలు రైతులే చేస్తున్నారు. తమ భూములు కౌలుకిచ్చేసి భూయజమానులంతా వ్యాపారాలు చేసుకుంటున్నారు. వాస్తవ సాగుదారుడైన కౌలు రైతులకు అందించాల్సిన సాయం మాత్రం సాగుచేయని భూయజమానులకే ప్రభుత్వం అందిస్తోంది. నిబంధనల ప్రకారం పంటరుణం సాగుచేసే రైతుకు అందించాలి. భూయజమానికి పంటేతర రుణం ఇవ్వాల్సి ఉంటుంది. అయితే బ్యాంకులు కౌలు రైతులకు పంటరుణాలు ఇవ్వడం లేదు. రైతు మిత్ర గ్రూపులకు అరకొరగా రుణాలిచ్చి అవే కౌలురైతులకిచ్చిన రుణాలుగా కాగితాల్లో చూపిస్తున్నారు.

### యజమానితో సంబంధం లేకుండా ఇవ్వాలి

కౌలు రైతు రుణ అర్హత కార్డులకు భూయజమానితో లింక్ పెట్టడం వల్ల కౌలు రైతులు నష్టపోతున్నారు. అప్పుల పాలవుతున్నారు. ఫలితంగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. భూయజమానితో సంబంధం లేకుండా కౌలు రైతు రుణ అర్హత కార్డులను మంజూరు చేయాలి. రైతు భరోసా, పంటల బీమా వంటి అన్ని రకాల ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించేలా చర్యలు తీసుకోవాలి.

**- జి.రామకృష్ణ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి**

**విద్యుత్ బకాయి చెల్లించకపోవడంతో**

## స్థలం స్వాధీనం : ఎస్ఇ

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

కర్నూలు జిల్లా కల్లూరు మండలం లక్ష్మీపురం బాలాజీ టిఎంటి రోడ్ మిల్స్ ఎస్ఎంఎస్ వారు బకాయి రూ.3,87,51,727 చెల్లించనందున సదరు సంస్థ స్థలం ఎపిఎస్‌పిడిసిఎల్ స్వాధీనంలో ఉంటుందని విద్యుత్ ఎస్ఇ ఎం.ఉపాపతి పేర్కొన్నారు. సోమవారం ఇందుకు సంబంధించిన గోడపత్రికను ప్రధాన గేటు వద్ద అతికించామని తెలిపారు. సదరు ఈ సంస్థకు సంబంధించిన స్థలం ఎపిఎస్‌పిడిసిఎల్ లిమిటెడ్ కర్నూలు వారి స్వాధీనంలో ఉంటుందని, సదరు స్థలంపై ఎలాంటి లావాదేవీలు జరపరాదని, అలా జరిపిన ఎడల చట్టరిత్యాతగు చర్యలు తీసుకుంటామని ఎస్ఇ ఎం.ఉమాపతి తెలిపారు. కార్యక్రమంలో ఎఎస్ఓ చిన్న రాఘవులు, ఇఇ (ఆపరేషన్) కర్నూలు పి. ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రికను అతికిస్తున్న అధికారులు

**15న విజయవాడ బహిరంగ సభను జయప్రదానికి**

# సిపిఎం రెడ్‌షర్ట్ వాలంటీర్ల ప్రదర్శన

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

కర్నూలు సిపిఎం ఓల్డ్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మారెళ్ల (విజయ్) రామాంజనేయులు అధ్యక్షతన కర్నూలు ఓల్డ్ సిటీ జమ్మి చెట్టు దగ్గర నుండి పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వరకు రెడ్‌షర్ట్ వాలంటీర్లు కవాతు చేస్తూ ప్రచారం చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ మాట్లాడుతూ దేశాన్ని పాలిస్తున్న బిజెపి ప్రభుత్వం అధికారాన్ని చేపట్టిన తర్వాత ఒకపక్క మతోన్మాదాన్ని, మరోపక్క ప్రైవేటీకరణ ప్రోత్సహిస్తూ దేశాన్ని నాశనం చేస్తుందన్నారు. దేశం కోసం, ధర్మం కోసం అని ప్రచారం చేస్తూ దేశ ప్రజల మధ్య మత వైశ్యామ్యాన్ని పెంచుతూ దేశాన్ని రావణ కాష్టంగా మార్చారని అన్నారు. ఒకపక్క దేశంలో ధనవంతుల సంఖ్యను వారి ఆదాయాన్ని పెంచుతూ మరో ప్రక్క అన్నం లేక ఆకలితో చచ్చే భారతదేశాన్ని వారి పాలనలో చూస్తున్నామని గుర్తు చేశారు. దైవ భక్తులమని చెప్పుకునే వారు కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి సాక్షిగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఐదు సంవత్సరాలు కాదు పది సంవత్సరాలు ఇస్తామని, రైల్వే జోను, వెనకబడిన జిల్లాల అభివృద్ధి నిధులు, రాష్ట్రంలో రెవెన్యూలోటును భర్తీ చేస్తామని చెప్పి పిడికెడు మట్టి చెంబు నీళ్లు ఇచ్చి వెళ్లిన పెద్దమనిషి ఇప్పటివరకు హామీలను అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో రోడ్లను, ఓడరేవులను అదానీలకు అంబానీలకు అప్పజెప్పడమే కాకుండా 36 మంది ప్రాణా త్యాగాల ఫలితంగా పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరిస్తాం లేదా మూసేస్తామని చెప్పడం రాష్ట్ర ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. గత టిడిపి ప్రభుత్వం విభజన హామీలను అమలు చేయించలేనందున చంద్రబాబు నాయుడు మోసం చేశాడని, ప్రజా సంకల్ప యాత్రలో ప్రచారం చేసి ప్రజలను నమ్మించి అధికారాన్ని చేపట్టిన వైఎస్. జగన్మోహన్ రెడ్డి పాలనా గత ముఖ్యమంత్రి పాలనా కంటే చాలా దారుణమైనదిగా ఉందన్నారు. నమ్మి ఓట్లేసి గెలిపించిన ఎస్టీ,ఎస్సీ,బీసీ,మైనార్టీ ప్రజల అభివృద్ధిని పట్టించుకోకుండా రాష్ట్రాన్ని ప్రైవేటు వారికి అప్పచెబుతూ పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు కేంద్రం పెంచుతున్నా ప్రశ్నించకుండా దాని ద్వారా తమ ఆదాయాన్ని పెంచుకున్నారని అన్నారు. నిత్యావసర సరుకులు ధరలు పెంచుతూ, కరెంటు బిల్లులు, ఇంటి పన్నులు, కుళాయి పన్నులు పెంచడమే కాకుండా రాష్ట్ర ప్రజలపై చెత్త పన్ను వేస్తున్నాడని గుర్తు చేశారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తామని కొంతమందికి మాత్రమే ఉద్యోగాలు ఇచ్చి ఎక్కువమందిని వాలంటీర్ల పేరుతో తక్కువ జీతంతో ఎక్కువ పని చేయించుకుంటున్నారని అన్నారు. కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని అధికారం చేపట్టిన వారంలోగా సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్ అమలు చేస్తామని , నవరత్నాల పేరుతో ప్రజలను మోసం చేస్తూ రూ.పదివేల ఇచ్చి లక్షలు లాక్కుంటున్నారని విమర్శించారు. ఇలాంటి మోసపూరిత ప్రభుత్వాలు దేశానికి రాష్ట్రానికి అవసరం లేదని, వారిని ఓడించాలని ప్రజలలో అసమానతలులేని అభివృద్ధిని సాధించాలనె సిపిఎంకు పట్టం కట్టాలని కోరుతూ నవంబర్ 15న విజయవాడ ఎంబి స్టేడియంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు అబ్దుల్ దేశాయి, షరీఫ్, నగర నాయకులు మల్లి, ఖలీల్, డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నగేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు లు రంగప్ప అబ్దుల్లా, నగర అధ్యక్ష కార్యదర్శులు అమర్, సాయి సిఐటియు, ఆటో యూనియన్ నాయకులు రవికుమార్,కుమార్, నాగరాజు ,నగర నాయకులు , హమాలీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రదర్శన చేపడుతున్న రెడ్‌షర్ట్ వాలంటీర్లు

**ఎద్దులదొడ్డి కోయరాతి కొండపై**

## చిరుత సంచారం

**- గొర్రెల కాపరులకు కనబడిన చిరుత**

**ప్రజాశక్తి-తుగ్గలి**

తుగ్గలి మండలం ఎద్దులదొడ్డి సమీపంలోని కోయరాతి కొండపై చిరుత సోమవారం గొర్రెల కాపరులకు కనపడింది. దీంతో గొర్రెల కాపరులు భయాందోళనకు గురై తమ గొర్రెల మందలను వేరే ప్రాంతాలకు తరలించారు. చిరుత కొండల్లో సంచారం చేస్తుందని సమాచారాన్ని ఫారెస్ట్ అధికారులకు తెలిపినా వారు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు వారిపై మండిపడుతున్నారు. ఇప్పటికే తుగ్గలి మండల పరిధిలోని రామకొండ, చనుగొండ్ల కొండ ప్రాంతాల్లో చిరుత సంచారాన్ని గొర్రెల కాపరులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. చిరుత సంచరిస్తుందన్నా ఫారెస్ట్ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ప్రస్తుతం తుగ్గలి మండలంలోని రాంపల్లి, ఎద్దుల దొడ్డి, పెండేకల్లు తదితర కొండల్లో ఇంకా సంచారం చేస్తోంది. చిరుత కొండల్లో సంచారం చేస్తుందన్న సమాచారంతో ఆయా గ్రామల ప్రజలు, గొర్రెల కాపరులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఫారెస్ట్ అధికారుల స్పందించి చిరుత సంచారాన్ని కనుగొని వాటి భారీ నుండి కాపాడాలని ప్రజలు, గొర్రెల కాపరులు కోరుతున్నారు.

## నన్నూరు ఎస్‌సి కాలనీలో రోడ్డుసైడ్ కాల్వలు నిర్మించాలి

**సిపిఎం డిమాండ్**

**ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్**

నన్నూరు ఎస్‌సి కాలనీలో సిసి రోడ్డు సైడ్ కాలువలు నిర్మించాలని, మురుగు నీటి నిలువలు తొలగించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఓర్వకల్లు మండలం నన్నురు గ్రామ ఎస్‌సి కాలనీలో సిపిఎం బృందం పర్యటించి కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిపిఎం మండల కార్యదర్శి బి.నాగన్న మండల నాయకులు ఎస్ .మధుసూదన్ , సభ్యులు సలాం, బషీర్, రోశన్న, రామాంజనేయులు పాల్గొన్నారు. బి.నాగన్న, ఎస్. మధుసూదన్ మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎన్ని మారినా ఎస్‌సి కాలనీలోని సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని అన్నారు. అనేక సంవత్సరాలుగా వర్షం పడితే రోడ్డుపై నీరు నిల్వ ఉండి కాలనీ ఇండ్లలో నుండి కాలు బయట పెట్టాలన్న పెట్టలేని స్థితి ఏర్పడిందన్నారు. వీధి చివర్లో ప్రైవేటు స్థలం వ్యక్తి నీటిని కిందికి రాకుండా కట్టవేసారని, దాంతో వర్షపు నీరు , ఇండ్లలో నుండి వచ్చే నీళ్ల పోవడానికి దారి లేక నిలువ ఉండి కాలనీవాసులు రోగాల బారిన పడుతున్నారని అన్నారు. సచివాలయ అధికారులకు చెబితే బిందెలతో తోడిపోసుకోవాలని ఉచిత సలహా చెబుతున్నారని అన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి సిసి రోడ్డు చేపట్టి సైడ్ కాలువలు నిర్మించి నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉద్యోగ కల్పనలో తగాదా పెట్టిన గ్రీన్ కో

**-పొలం ఇచ్చిన యజమానికి యధావిధిగా ఉద్యోగం**

**-అదే స్థానంలో మరో ప్రయివేటు వ్యక్తికి ఇవ్వగా ఇరువురు ఘర్షణ**

**ప్రజాశక్తి-సి బెళగల్**

పొలం ఇచ్చిన ప్రతి యజమాని కుటుంబానికి ఒక ఉద్యోగం ఇవ్వడంలో భాగంగా గ్రీన్‌కో కంపెనీ తంటా పెట్టి తమాషా చూసిన ఘటన ఆదివారం సి.బెళగల్ మండలంలో చోటు చేసుకొంది. గూడూరుకు చెందిన రైతు బోయ హరికృష్ణ పొలం బ్రాహ్మణదొడ్డి రెవిన్యూ శివారులో ఉంది. అతనికి ఒక వాచ్‌మెన్ ఉద్యోగం ఇవ్వగా అతనికి తెలియకుండా బ్రాహ్మణ దొడ్డికి చెందిన ఓ వ్యక్తికి అదే స్థానం ఉద్యోగం ఇచ్చినట్లు తెలిసింది. ఇది తెలియక ఇక్కడ ఉద్యోగం స్థానం నాదంటే నాది అంటూ ఘర్షణ పడ్డారు. దీంతో హరికృష్ణకు తీవ్ర గాయాలు కాగా కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించగా విచారిస్తున్నట్లు తెలిసింది.

**గ్రామాల్లో ఎస్ఐ సందర్శన :** ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ మన్మధ విజయ్ మండలంలోని ఆయా గ్రామాల్లో సందర్శించారు. ప్రజలతో, గ్రామ పెద్దలతో జీవన స్థితి గతులపై ఆరా తీశారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకోని రావాలని ప్రధానంగా గొడవలకు దూరంగా ఉండాలని సూచించారు.

# నగరంలో నత్తనడకన అభివృద్ధి పనులు

### రోడ్లపై నడవలేక కింద పడుతున్న వృద్ధులు పిల్లలు

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

నగరంలో వివిధ ప్రాంతాల్లో మున్సిపల్ కాంట్రాక్టర్లు రోడ్లను తవ్వి నత్తనడకన అభివద్ధి పనులు చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి, ఓల్డ్ సిటీ నగరాభివృద్ధి కమిటీ నాయకులు డి.అబ్దుల్ దేశాయ్ విమర్శించారు. ఉదాహరణకు పాత నగరంలోని పింజరివీధి, ఖలీల్‌వాడిలో పైప్ లైన్‌ల కోసం తవ్వి సక్రమంగా మరమ్మతులు చేయకుండా రోజుల తరబడి రోడ్లపై తవ్విన గుంతలు, మట్టి, రాళ్లు వదిలేయడంతో ప్రతిరోజు వృద్ధులు పిల్లలు కింద పడుతున్నారని తెలిపారు. సోమవారం రెండు సంఘాల ప్రతినిధులు ఆ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ మున్సిపల్ అధికారులకు పన్నుల వసూళ్లపై చూపిస్తున్న శ్రద్ధ ప్రజల సమస్యల పై చూపడం లేదన్నారు. పైపులైన్ల కొరకు రోడ్లు తవ్వినందువల్ల రోడ్లు కాలువలు కల్వర్టులు శిధిలమై ప్రజలు నడవలేక పోతున్నారని, వెంటనే మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, ప్రజా ప్రతిథులు స్పందించి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న సంబంధిత ఇంజనీరు, కాంట్రాక్టర్ పై చర్య తీసు కుని అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయా లని కోరారు. వార్డు కమిటీ సభ్యులు ,సత్యం, రమేశ్, గోవిందు,పి. మున్నాభై పాల్గొ న్నారు.

రోడ్లపై గుంతలను పరిశీలిస్తున్న పట్టణ పౌరసంక్షేమ సంఘం నాయకులు

# యశోద హాస్పిటల్స్‌లో వెరికోస్ వెయిన్స్‌కు మేలైన చికిత్స

**ప్రముఖ వాస్కులర్ సర్జన్ డాక్టర్ ఎస్ శ్రీ కాంత్‌రాజు**

**ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్**

మీరు ఎక్కువసేపు కూర్చోవడం లేదా నిల్చుని చేసే ఉద్యోగాలు చేస్తున్నారా అయితే వెరికోస్ వేయిన్స్ సమస్య వచ్చే అవకాశం ఉందని ప్రముఖ యశోద హాస్పిటల్ హైటెక్ సిటీ వైద్యులు డాక్టర్ ఎస్. శ్రీకాంత్ రాజు (జనరల్ సర్జన్, వాస్కులర్ సర్జన్) తెలిపారు. ఐటి ఉద్యోగులు, బ్యాంకు ఉద్యోగులు, ట్రాఫిక్ పోలీస్‌లు, టీచర్లు, సెక్యూరిటీ గార్డుల వంటి ఉద్యోగాల్లో ఉండేవాళ్లకు వెరికోస్ వీన్స్ వచ్చే అవకాశం ఎక్కువ అని ప్రజాశక్తితో ఆయన తెలిపారు. ఆయన మాటల్లో.....

**కారణాలు:** సిరల్లో రక్తం గురుత్వాకర్షణకు వ్యతిరేకంగా శరీరం కింది భాగం నుంచి పై భాగానికి ప్రయాణిస్తుంది. అందుకే రక్తం తిరిగి కిందికి రాకుండా ఉండడం కోసం సిరల్లో కొన్ని కవాటాలు ఉంటాయి. ఈ కవాటాలలో ఇబ్బంది తలెత్తినప్పుడు వెరికోస్ వెయిన్స్ సమస్య వస్తుంది.

**రక్తం గడ్డకట్టడం యొక్క వైద్య చరిత్ర:** రక్తం గడ్డకట్టడం వల్ల సిరల గోడలు లేదా కవాటాలు దెబ్బతింటాయి, ఇది అనారోగ్య సిరల అభివద్ధికి దారితీస్తుంది. ఎక్కువసేపు నిలబడి లేదా అడ్డంగా కూర్చోవడం, ఊబకాయం , అధిక బరువు కలిగిన వ్యక్తులు ఈ వ్యాధి బారిన పడతారు.

**గర్భం:** గర్భధారణ సమయంలో మార్పులు, పెరుగుతున్న శిశువు బరువు వలన రక్తనాళాలపై ఒత్తిడిని కలిగిస్తుంది, రక్త ప్రవాహాన్ని మారుస్తుంది , పెరిగిన రక్త పరిమాణం కూడా సిరలను విస్తరింపజేస్తుంది. రక్తాన్ని తిరిగి గుండెకు పంపింగ్ చేయడం అసమర్థంగా ఉంటుంది.

**వద్ధాప్యం:** అనారోగ్య సిరలు అభివృద్ధి చెందుతున్న చాలా మంది వ్యక్తులు 40 నుంచి 80 ఏళ్ల మధ్య ఉంటారు. ఈ మధ్య 25 సంవత్సరాల వయస్సులో కూడా వస్తున్నాయి. **కుటుంబ చరిత్ర:** కుటుంబ సభ్యుల చరిత్రలో ఎవరైనా వెరికోస్ వీనస్‌తో బాధపడి ఉంటే తరువారు తరానికి కూడా వచ్చే అవకాశం ఉంది.

**లక్షణాలు:** కాలు నొప్పి, కాలు వాచిపోతుంది.కండరం లాగినట్టుగా ఉంటుంది. చర్మంలో మార్పులు వస్తాయి. చర్మం కింద ఉండే రక్తనాళాలు బలహీనమై, ఉబ్బిపోతాయి. అందువల్ల అవి చర్మం పై నుంచి స్పష్టంగా కనిపిస్తాయి. దీర్ఘకాలిక నొప్పి, కాలివాపు, రక్తనాళాలు పైకి కనిపించడం, చర్మంలో మార్పులు, పదే పదే పుండ్లు ఏర్పడి ఎంతకీ తగ్గకపోవడం లాంటి సమస్యల్లో ఏది ఉన్నా వెంటనే డాక్టర్‌ని కలవాలి. నొప్పి ఉన్నా లేకపోయినా డాక్టర్‌ను కలిసి పరీక్షలు చేయించుకోవాలి.

**చికిత్స ఏంటి?:** వ్యాధి నిర్ధారణ కోసం ముందుగా క్లినికల్‌గా పరీక్ష చేస్తారు. తరువాత కలర్ డాప్లర్ స్కాన్ చేస్తారు. ఈ స్కాన్‌లో వ్యాధి ఏ దశలో ఉందో తెలుస్తుంది. తొలి దశలో ఉన్నప్పుడు మందులు ఇస్తారు. వ్యాధి తీవ్రంగా ఉన్నప్పుడు సర్జరీ ద్వారా రక్త నాళాలను ఓపెన్ చేసి చెడి పోయిన కవాటాన్ని తొలగిస్తారు. ఓపెన్ సర్జరీ లేకుండా లేజర్ కాంతి పంపించి చెడిపోయిన కవాటం ఉన్నచోట రక్తనాళాన్ని మూసివేస్తారు. గ్లూ ఇంజెక్షన్ థెరపీ ద్వారా కూడా ఓపెన్ అయిన రక్తనాళాన్ని బ్లాక్ చేయడం ద్వారా మూసివేస్తారు. ఈ ఆధునిక చికిత్సలు పూర్తిగా డేకేర్ ప్రొసిజర్లుగా చేస్తారు. ఇవి ఓపెన్ సర్జరీ కాదు కాబట్టి రక్తస్రావం ఎక్కువగా ఉండదు. కాబట్టి చికిత్స తరువాత వెంటనే ఇంటికి వెళ్లిపోవచ్చు. విశ్రాంతి కూడా అవసరం లేదు. కాకపోతే కాళ్ల మీద ఎక్కువ ఒత్తిడి పడకుండా చూసుకోవాలి. ఈ చికిత్సల ద్వారా వెరికోస్ వీన్స్‌ని పూర్తిగా నయం చేయవచ్చు. అయితే ఆ తరువాత జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకోవాల్సి ఉంటుంది. ఎక్కువసేపు కూర్చోవడం గానీ, నిల్చోవడం గానీ చేయొద్దు. మధ్య మధ్యలో కాళ్లకు విశ్రాంతి ఇవ్వాలి. లేదా అటూ ఇటూ నడవాలి. పడుకునేటప్పుడు కాళ్ల దగ్గర దిండు పెట్టుకుని దానిమీద కాళ్లు ఉంచాలి. కాళ్లను కొంచెం పైకి పెట్టుకుంటే కాళ్లలో రక్తప్రసరణ బాగా జరుగుతుంది.

## మేం కలలు గంటున్నాం

అమ్మ వడిలో ఆడు కోవాలని
నాన్న భుజాలపై స్వారీ చెయ్యాలని
అమ్మమ్మ, నానమ్మ, తాత య్యలతో కబుర్లు చెప్పాలని, వారి కథలు వినాలని...
కానీ
ఉదయం నుండి రాత్రి వరకుచదువు పేరుతో, యింకా నిద్ర
మబ్బు వీడని మమ్మల్ని పరుగులు
పెట్టించి, బస్సుల్లో కూరి,
బంది కానాల్లాటి బడిలో బంధించి వేస్తారు,
రాత్రయినా మీతో గడపాలి అని
కలలు గంటాము, మీరేమో మాతోకాదు, సెల్‌తో మాట్లాడు తుంటారు, అంతెందుకు....
యింతప్పటి నుంచీ మా నోర్లు
కట్టేయ డానికి మా వడిలో వో
సెల్లు పడేస్తారు, లేదా టీవీ ముందు
కూలేసి చేతులు దులుపు కుంటారు
టెక్నాలజీ ఔపోసన పట్టేసామని
పది మందికీ చెప్పి మురిసి పోతారు,
యింట్లో బడిలో ఇంగ్లీషే మాట్లాడాలని రూలు పెడతారు
అందుకే, అమ్మ భాషలో మాట్లాడాలన్న
అమ్మతో మాట్లాడాలన్న ఏదో జంకు
మరేదో బెరుకు,
మన సంస్కృతి, సంప్రదాయం
సాహిత్యము సంగీతం తెలియకుండా, మానవీయ
విలువలు లేకుండా, ఏ భవమూ
పలకని ముఖాలతో ఉండే వింత
యంత్రాలుగా మమ్మల్ని తయారు చేస్తున్నారు, కానీ
మాకు మీరందించే ప్రేమ, ఆప్యాయత, మానవతా
విలువలు, భారతీయ సంస్కృతి పట్ల
గౌరవాభిమానాలు కావాలి,
బాలబాలికల మయిన మేము
రేపు పెద్దయ్యాక వాటిని భద్రంగా
మీకు అందిస్తాము,
పది మందికీ పంచి శెభాష్
అని పించు కుంటాము....

**డాక్టర్ బివి. స్వరూప్ సిన్హా-అధ్యాపకులు, కర్నూలు**

**(బాలల దినోత్సవం ప్రత్యేకం)**

## కర్ణాటక అక్రమ మద్యం పట్టివేత

**ప్రజాశక్తి-సి బెళగల్ :** మండలంలోని బురాన్ దొడ్డిలో బోయ గోవింద్ కర్ణాటక అక్రమ మద్యం అమ్ముతుండగా ఎస్ఐ మన్మథవిజయ్ సోమవారం సిబ్బందితో వెళ్లి పట్టుకున్నారు. సుమారు 90 ఎంఎల్ టేట్రా పాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. అతడిని అదుపులోకి తీసుకోని కేసు నమోదు చేశారు. అక్రమ మద్యంతో అక్రమ వ్యాపారాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# గ్రంథాలయాల ద్వారా విజ్ఞానం

- రాష్ట్ర మంత్రి గుమ్మనూరు

**ప్రజాశక్తి-ఆలూరు**

గోడపత్రికను విడుదల చేస్తున్న మంత్రి గుమ్మనూరు

గ్రంథాలయాల ద్వారానే విద్యార్థులు, యువత విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ తెలిపారు. ఆదివారం ఆలూరులోని స్వగృహంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎంతో మంది మేధావులు గ్రంథాలయాల్లో ఉన్న పుస్తకాలు చదివి ఉన్నత స్థాయికి ఎదిగారని తెలిపారు. విద్యార్థులు, యువత, ప్రజలు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైసిపి ఇన్‌ఛార్జీ నారాయణస్వామి, జడ్‌పిటిసి ఏరూరు శేఖర్, దేవరగట్టు కమిటీ ఛైర్మన్ శ్రీనివాసులు, ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి గ్రంథాలయ అధికారులు ఎన్.వెంకటేశ్వర్లు, విశ్వనాథ్ రెడ్డి, అబ్దుల్ రసూల్, విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు వీరస్వామి, ఈరన్న పాల్గొన్నారు.

# జగన్ పాలనలో రైతులకు లబ్ధి

- వైసిపి మండల కన్వీనర్ జూటూరు మారయ్య

**ప్రజాశక్తి - చిప్పగిరి**

సాగునీటిని విడుదల చేయిస్తున్న మారయ్య

ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి జగన్మోహన్ రెడ్డి రైతులకు అన్ని రకాలుగా ఆర్థిక లబ్ధి చేకూరుస్తున్నారని ఎంపిపి జూటూరు హేమలత, వైసిపి మండల కన్వీనర్ జూటూరు మారయ్య తెలిపారు. సోమవారం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆలూరు బ్రాంచి కాలువకు సాగు, తాగునీటిని విడుదల చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆలూరు బ్రాంచి కాలువ కింద ఆయకట్టు, నాన్ ఆయకట్టు రైతులు వేల ఎకరాల్లో పత్తి, మిరప, శనగ, కంది, జొన్న పంటలను సాగు చేశారన్నారు. పంట చేతికొచ్చే సమయంలో ఇరిగేషన్ అధికారులు ఆలూరు బ్రాంచి కాలువకు హంద్రీనీవా కాలువ నుంచి విడుదలయ్యే సాగునీటిని నిలిపివేయడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారని తెలిపారు. రైతుల విన్నపం మేరకు ఇటీవల సత్యసాయి జిల్లా పుట్టపర్తికి వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. కాలువకు సాగు, తాగు నీటిని విడుదల చేయాలని రాష్ట్ర మంత్రి గుమ్మనూరు జయరామ్ ఆధ్వర్యంలో విన్నవించగా స్పందించిన ముఖ్యమంత్రి వెంటనే సమస్య పరిష్కరించాలని అక్కడున్న అధికారులను ఆదేశించారని తెలిపారు. ఆదివారం ఉదయం హాలహర్వి, చిప్పగిరి మండలాల రైతులతో కలిసి వెళ్లి, హంద్రీనీవా కాలువ నుంచి ఆలూరు బ్రాంచి కాలువకు నీరు వచ్చే విధంగా జెసిబి హిటాచ్‌లతో మట్టిని తీసి యథావిధిగా సాగునీరు విడుదల చేశామన్నారు. నాయకులు లాల్‌స్వామి, ధనుంజయ, లింగన్న, మురళీ, డేగులపాడు సర్పంచి నీలకంఠ పాల్గొన్నారు.

# టిటిడి ధార్మిక కార్యక్రమాల కరపత్రాలు విడుదల

**ప్రజాశక్తి - మంత్రాలయం**

కరపత్రాలను విడుదల చేస్తున్న సీతారామిరెడ్డి

టిటిడి ఆధ్వర్యంలో నిర్వహించే ధార్మిక కార్యక్రమాలపై టిటిడి పాలకమండలి సభ్యులు వై.సీతారామిరెడ్డి కరపత్రాలు విడుదల చేశారు. సోమవారం ఎమ్మిగనూరు పట్టణంలోని భీమా నిలయంలో వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి, టిటిడి ధార్మిక మండలి సభ్యులు సూర్య నారాయణ చార్యులు, ఇతర నాయకులతో కలిసి విడుదల చేశారు. స్థానిక ఆంజనేయ స్వామి ఆలయం వద్ద టిటిడి ఆధ్వర్యంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ వారి నుంచి నాలుగు రోజుల పాటు ధార్మిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు సీతారామిరెడ్డి పేర్కొన్నారు. విశ్రాంత తహశీల్దార్ వర్మ, నారాయణ రెడ్డి, బంగారుబాబు, గురు ఉన్నారు.

# 17 నుంచి మహిళా సమాఖ్య రాష్ట్ర మహాసభలు

- సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షులు జయమ్మ

**ప్రజాశక్తి - ఆదోని**

ఈనెల 17 నుంచి 19 వరకు నంద్యాలలో జరిగే 15వ ఎపి మహిళా సమాఖ్య రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షులు కొర్రపాటి జయమ్మ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్ బాబు కోరారు. సోమవారం ఆదోనిలోని బోయగేరిలో కరపత్రాలను మహిళలతో విడుదల చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నేడు మహిళలు, చిన్నారులు, దళితులు, మైనార్టీల పై జరిగే నేరాలను అదుపు చేసేందుకు చట్టాలను అమలు చేయాలని కోరారు.

# వాలంటీర్ల నిర్లక్ష్యం

- బాధితులకు అందని వైఎస్ఆర్ బీమా
- ఉదాసీనంగా వ్యవహరిస్తున్న అధికారులు

**ప్రజాశక్తి - ఆస్పరి**

**వాలంటీర్ల నిర్లక్ష్యంతో బాధితులకు బీమా అందడం లేదు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రజల వద్దకు పాలన అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వాలంటీరు వ్యవస్థను తీసుకొచ్చారు. ప్రభుత్వ పథకాలను పార్టీలకతీతంగా అందించాలని ముఖ్యమంత్రి చెబుతుండగా కొంతమంది వాలంటీర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.**

ఆస్పరిలో వైఎస్ఆర్ బీమా కొంతమంది అర్హులకు అందని పరిస్థితి నెలకొంది. ఆస్పరి గ్రామంలో శుద్ధ బాయి కాలనీ ముని రాజు (26) మృతి చెందారు. వాలంటీర్లు కుటుంబ యజమానిగా ఉన్న యువకుని పేరు ఆన్‌లైన్‌లో ఎన్‌రోల్‌మెంట్ చేయకపోవడంతో వైఎస్ఆర్ బీమా అందని పరిస్థితి ఏర్పడింది. యువకునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. బీమాకు ఎన్‌రోల్‌మెంట్ చేసి ఉంటే ఆ కుటుంబానికి వైఎస్ఆర్ బీమా కింద అందే రూ.లక్ష పరిహారం ఉపయోగపడేది. ఇదే కాకుండా చాలా మంది వాలంటీర్లు విధుల పట్ల నిర్లక్ష్యం చేయడంతో ప్రభుత్వం అందించే వైఎస్ఆర్ బీమా పథకం మృతుల కుటుంబాలకు దరిచేరడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్ఆర్ బీమా 60 ఏళ్ల నుంచి 49 ఏళ్లకు కుదించడంతో విమర్శలు వినిపిస్తున్నాయి. కనీసం 50 నుంచి 55 ఏళ్ల వరకు బీమా వర్తిస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు. నవంబర్ 8న బాట లింగన్న (53) అనే రైతు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. 49 ఏళ్లు పైబడి ఉండడంతో బీమా వర్తించ లేదు. వ్యక్తులు సాధారణ, ప్రమాదాల్లో మృతి చెందితే కుటుంబానికి బీమా వర్తించకపోవడంతో నిరుపేద కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఆస్పరిలోనే ఇలాంటి పరిస్థితులు ఉంటే గ్రామీణ ప్రాంతాల్లో మరింత అధ్వానంగా ఉంటుందని మండిపడుతున్నారు. అధికారుల ఉదాసీనత వల్లే వాలంటీర్లు సక్రమంగా పని చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి వాలంటీర్లు విధులు సక్రమంగా నిర్వర్తించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఆస్పరి గ్రామ సచివాలయం

# ముస్లిం, మైనార్టీలకు సముచిత స్థానం

- ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాష

**ప్రజాశక్తి - కౌతాళం**

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ముస్లిం, మైనారిటీలకు సముచిత స్థానం కల్పించినట్లు ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాష తెలిపారు. ఆదివారం రాత్రి శ్రీజగద్గురు ఖాదర్ లింగ స్వామి దర్గాలో మజీద్-ఎ-ఖదీర్, దర్గా ఉత్తర ద్వారం ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాష, ఆదోని ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో నాలుగు ఎమ్మెల్యే, నాలుగు ఎమ్మెల్సీలు, ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. ముస్లింలకు రాజకీయంగా అవకాశం కల్పించినట్లు తెలిపారు. వైఎస్.రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం కల్పించిన నాలుగు శాతం రిజర్వేషన్ల ద్వారా అనేక మంది వివిధ రంగాల్లో ఉద్యోగులుగా రాణిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వాల్లో ముస్లింలకు రాజకీయంగా ప్రాముఖ్యత లభించలేదన్నారు. జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు ముస్లిం, మైనార్టీలు కృషి చేయాలని కోరారు. అనంతరం నూతనంగా నిర్మించిన మజీద్-ఎ-ఖదీర్, మదర్సా, దర్గా ఉత్తర ద్వారాన్ని ప్రారంభించారు.

**మత సామరస్యానికి ప్రతీక దర్గాలు**

- అజ్మీర్ పీఠాధిపతి సయ్యద్ నసురుద్దీన్ చిష్టి

దేశంలో మతసామరస్యానికి ప్రతీకగా దర్గాలు వెలిశాయని దేశంలోనే పేరుగాంచిన అజ్మీర్ ఖాజా బందే నమాజ్ దర్గా ప్రధాన పీఠాధిపతులు సయ్యద్ నసురుద్దీన్ చిష్టి, ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాష పేర్కొన్నారు. శ్రీజగద్గురు ఖాదర్ లింగ స్వామి దర్గా గుల్బర్గా దర్గా, కడపలోని అమీర్ పీర్ పెద్ద దర్గాలో అనుసంధానంగా నమాజ్ కోసం మజీద్‌లో ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయమన్నారు. శ్రీజగద్గురు ఖాదర్ లింగ స్వామి పీఠాధిపతులు భక్తులకు సౌకర్యాలను కల్పించడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. అనంతరం చిన్నతుంబలం, కోసిగి, కౌతాళం ముస్లిం, మైనార్టీలు వక్ఫ్ బోర్డులో ఉన్న సమస్యల పరిష్కారం కోసం ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషకు వినతిపత్రాలు అందజేశారు. అంతకుముందు కౌతాళం దర్గా పీఠాధిపతులు పెద్ద మున్నా పాషా, చిన్న మున్నా పాషా, ఖాదర్ బాషలు అతిథులను శాలువా, పూలమాలలతో సన్మానించారు. కర్ణాటక శాసనసభ స్పీకర్ యుటి.ఖాదర్, మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాల నాగిరెడ్డి, తెలంగాణ రాష్ట్రం గద్వాల్ ఎమ్మెల్యే మురళీ కృష్ణమోహన్ రెడ్డి, జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ సబియా పర్వీన్, వక్ఫ్ బోర్డు ఖాజా సాబ్, వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి, దాట్ల కృష్ణంరాజు, వీర సేనా రెడ్డి, సర్పంచి పాల్ దినకరన్, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి పాల్గొన్నారు.

ఉత్తర ద్వారాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న అంజాద్ బాష

# వాస్తవ సాగుదారులకే భూ హక్కులు కల్పించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వెంకటేశులు

**ప్రజాశక్తి - కోసిగి**

వాస్తవ సాగుదారులకే భూహక్కులు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.వెంకటేశులు డిమాండ్ చేశారు. గత 20 ఏళ్లుగా చిన్నారెడ్డి, శాంతమ్మ సాగు చేసుకుంటున్న కోసిగిలోని సర్వే నెంబర్ 425లో ఎకరా 30 సెంట్ల ప్రభుత్వ భూమిని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిరుపేద వ్యవసాయ కూలీ చిన్నారెడ్డి 20 ఏళ్ల క్రితం ముళ్ల చెట్లతో నిండి ఉన్న ప్రభుత్వ భూమిని వేలాది రూపాయలు ఖర్చు పెట్టి చదును చేసి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ప్రతేడాది మాదిరిగానే ఈఏడాది కూడా వేల రూపాయలు పెట్టుబడి పెట్టి పత్తి పంట సాగు చేశారని చెప్పారు. ఈ మధ్యలోనే రీసర్వే అధికారులు పొలాలపై రీసర్వేకు వచ్చారని, ఈ పొలం వారం ఈరన్న, వారం అంజనమ్మ పేర్లపై నమోదయిందని తెలిపారని అన్నారు. ఈ పేరు గల వ్యక్తి కోసిగిలో ఎవరూ లేరని, తుమ్మిగనూరు గ్రామానికి చెందిన అధికార పార్టీ కార్యకర్త అని చెప్పారు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం విచారకరమని తెలిపారు. రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకుని సాగులో లేని వారి పేర్లను తొలగించి వాస్తవ సాగుదారుడైన చిన్నారెడ్డికి భూహక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రెవెన్యూ కార్యాలయం ముందు ధర్నా చేపడతామని హెచ్చరించారు. బొంపల్లి గ్రామంలో ఇదే పరిస్థితి ఉందన్నారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి బాధితులకు న్యాయం జరిగే వరకూ పోరాడతామని తెలిపారు. సిపిఎం మండల కన్వీనర్ రాముడు, నాయకులు వీరేష్, బాధిత రైతు చిన్నారెడ్డి పాల్గొన్నారు.

బాధిత రైతుతో కలిసి పొలాన్ని పరిశీలిస్తున్న సిపిఎం

# సమస్యలు కనిపించడం లేదా..?

- ఓట్లు అడగడానికి వస్తారు కదా..! అప్పుడు చెబుతాం

**ప్రజాశక్తి- పెద్దకడబూరు**

తమ వార్డు సమస్యలు ఎమ్మెల్యేకు కనిపించడం లేదని పెద్దకడబూరు పదో వార్డు మహిళలు విమర్శించారు. ఆదివారం వారు దుర్వాసన వస్తున్న కాలువలను చూపిస్తూ మాట్లాడారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి శుక్రవారం తమ వార్డు మీదుగా వెళ్లారని తెలిపారు. తమ వార్డు సమస్యలు ఆయనకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. తాగునీరు, డ్రెయినేజీ సమస్యలను పరిష్కరిస్తామని ఎన్నికల ముందు వాగ్దానాలు చేశారని, ఇప్పటివరకు చేసిందేమీ లేదని తెలిపారు. తమ వార్డులో ఓట్లు అడగడానికి సర్పంచి, వార్డు సభ్యులు వచ్చారని, వారికి కూడా సమస్యలు కనిపించడం లేదా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం వస్తే డ్రెయినేజీ నీరు మొత్తం ఇళ్లలోకి చేరుతోందని, దుర్వాసన వస్తోందని తెలిపారు. ఇంట్లో ఉన్న పిల్లలు అనారోగ్యం పాలవుతున్నారని చెప్పారు. వార్డు సభ్యులు కూడా చూస్తూనే ఉంటారని, సమస్యను పరిష్కరించకుండానే వెళ్తారని తెలిపారు. రాబోయే రోజుల్లో ఎన్నికలు వస్తాయని, అప్పుడు ఓట్లు అడగడానికి తమ వార్డుకు వస్తారని, అప్పుడు తామెంటో చూపిస్తామని హెచ్చరించారు.

ఆవేదన వ్యక్తం చేస్తున్న మహిళలు

# బాణసంచా ధరల మోత

- ప్రజలను దోచుకుంటున్న వ్యాపారులు

**ప్రజాశక్తి - ఆదోని**

దీపావళి వచ్చిందంటే చాలు చిన్న, పెద్ద తేడా లేకుండా బాణసంచా కాల్చి సంబరాలు చేసుకుంటారు. వ్యాపారులు ఇదే అదునుగా భావించి ధరలు అమాంతంగా పెంచి వినియోగదారులను దోచుకుంటున్నారు. పట్టణంలోని మున్సిపల్ మైదానంలో 9 బాణసంచా విక్రయ స్టాళ్లు ఏర్పాటు చేశారు. దుకాణాల్లో సాధారణంగా విక్రయించే బాణసంచా ప్యాకెట్లపై ఐఎస్ఐ ముద్ర ఉండాలి. వారు సూచించిన ఎంఆర్‌పి ధర స్పష్టంగా ఉండాలి. అనధికారికంగా ప్యాకెట్లపై ఎక్కువ ధర ముద్రించినట్లు స్పష్టంగా తెలుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా ఎంఆర్‌పి ధర ఎక్కువగా ముద్రించి ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. ప్యాకెట్‌పై ఉన్న ధర మేరకే విక్రయిస్తున్నామని వ్యాపారులు చెబుతున్నారు. ఏది నిజమో, ఏది నకిలీనో తెలియక వారు ఇచ్చిందే తీసుకొని, కాగితంలో పేర్కొన్న మొత్తానికి లెక్క ఇచ్చి వెళ్తున్నారు. సంబంధిత అధికారులు నిఘా ఉంచి స్పష్టమైన ధరలకే బాణసంచా విక్రయాలు జరిగేలా చూడాలని పట్టణ వాసులు కోరుతున్నారు. ఎందుకు అధిక ధరకు అమ్ముతున్నారని అడగ్గా వారిని, వీరిని చూసుకోవాలని, డిపార్ట్‌మెంట్ల వారు వచ్చి తీసుకెళ్తున్నారని, దీనివల్ల నష్టం జరగకుండా ఇలా అమ్మడం మాత్రమే మార్గమని వ్యాపారులు బాహాటంగానే చెబుతున్నారు. రూ.వేలాది జీతం తీసుకుంటున్న ఉద్యోగులు ఇలా పండగ, పూజ పేరుతో బాణసంచా తీసుకెళ్లడం జరుగుతుందని, ఇది పద్ధతి కాదని పలువురు తప్పు పడుతున్నారు. పట్టణ ప్రజల సౌకర్యార్థం మైదానంలో బాణసంచా విక్రయ స్టాళ్ల ఏర్పాటుకు స్థలాన్ని అధికారులు ఇస్తున్నారు. వ్యాపారులు లాభాపేక్ష ధోరణితోనే అధిక ధరలకు విక్రయిస్తున్నారని వినియోగదారులు అంటున్నారు.

# ఎస్సీ వర్గీకరణపై సిఎం ఎందుకు నోరు మెదపడం లేదు..?

- టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ

**ప్రజాశక్తి - ఆదోని**

ఎస్సీ వర్గీకరణపై ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి ఎందుకు నోరు మెదపడం లేదని టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె కృష్ణమ్మ ప్రశ్నించారు. సోమవారం ఆమె ఆదోనిలో మాట్లాడారు. వర్గీకరణకు కేంద్ర ప్రభుత్వం ముందు కొచ్చినా జగన్ రెడ్డి స్పందించడం లేదన్నారు. దళితుల చిరకాల వాంఛ వర్గీకరణకు జగన్ అడ్డంకులు సృష్టిస్తున్నా రని తెలిపారు. ఈ అంశంపై నాలుగున్నరేళ్లలో ఒక్కరోజు కూడా ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి స్పందించలేదన్నారు. సామాజిక న్యాయం టిడిపితోనే సాధ్యమన్నారు. మాదిగ, మాల కార్పొరేషన్‌కు ఒక్క రూపాయి కూడా జగన్ ప్రభుత్వం కేటాయించలేదని విమర్శించా రు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌కు బుద్ధి చెప్పేందుకు ఎస్సీలు సిద్ధంగా ఉన్నారన్నారు.

## ఇష్టపడి చదివితే మంచి భవిష్యత్తు

**ప్రజాశక్తి - నందవరం**

బాలికలు ఇష్టంతో కష్టపడి చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని ఎమ్మిగ నూరు రూరల్ సిఐ మోహన్ రెడ్డి తెలి పారు. సోమవారం నందవరం కస్తూరిబా బాలికల విద్యాలయంలో బాలికలకు బాణసంచా అందించి దీపావళి జరుపు కున్నారు. బాలికల చేత వెలిగిస్తూ, కాలుస్తుంటే చిన్నారుల కళ్లల్లో ఆనందాలను చూస్తూ కాసేపు అక్కడే ఉండి విద్యార్థినులతో దీపావళి సంబరాలను జరుపు కున్నారు. పాఠశాల ప్రిన్సిపల్ శైలజ, ఎస్ఐ తిమ్మయ్య పాల్గొన్నారు.

**బహిరంగ సభను జయప్రదం చేయండి : సిపిఎం**

**పెద్దకడబూరు :** ఈనెల 15న విజయవాడ బిఆర్‌డిఎస్ రోడ్డులోని ఫుడ్ జంక్షన్‌లో జరిగే ప్రజా రక్షణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు, మండల కార్యదర్శి తిక్కన్న, రైతుసంఘం జిల్లా నాయకులు పరమేష్ కోరారు. సోమవారం పెద్దకడబూరు బస్టాండ్ ఆవరణలో కరపత్రాలను పంపిణీ చేశారు. వారు మాట్లాడారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన మతోన్మాద బిజెపిని ఓడించాలని కోరారు.

# సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

- ఎడిఎ మహ్మద్ ఖాద్రీ

**ప్రజాశక్తి -గోనెగండ్ల**

మిరపకు సోకిన తెగులు

పంటలను కాపాడుకోవడానికి రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఎడిఎ మహ్మద్ ఖాద్రీ, ఎఒ హేమలత సోమవారం తెలిపారు. మండలం లో సాగు చేసిన మిరప పంటలో కొన్ని రకాల కొత్త తెగుళ్లు, వివిధ రకాల పురుగులు ఆశించడంతో వాటిని నివారించుకుని పంటను కాపాడుకోవడానికి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మిరప పంటలో రైతులు తీసుకోవాల్సిన సస్య రక్షణ చర్యల గురించి ఎడిఎ మహ్మద్ ఖాద్రీ, ఎఒ హేమలత వివరించారు. తామర పురుగులు, పచ్చ రబ్బరు పురుగు, కొంచెం బూడిద తెగులు గమనించినట్లు తెలిపారు. తామర, పచ్చ రబ్బరు పురుగుకు ఫ్లుక్సా మెటమైడ్ 'ఎ' 16 మిల్లీ/20లీటర్ల పంపునకు కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. బూడిద తెగులు నివారణకు అజాక్సీ స్ట్రోబిన్ 'ఎ' 10 మిల్లీ/20 లీటరు పంపునకు కలిపి పిచికారి చేసుకోవాలని తెలిపారు. ఈ పురుగు, తెగుళ్ల నివారణకు బవేరియా, వర్టిసీలియం, సూడో మోనాస్ ఒక్కోటి 100 మిల్లీ/20 లీటర్ల పంపునకు కలిపి, ప్రతి పంపునకు 200 గ్రాముల బెల్లం కరిగించిన నీరు పోసి, ప్రతి రసాయన మందు స్ప్రే తర్వాత 4 రోజులకు ఈ జీవ క్రిమి నాశనుల పిచికారీ చేయాలని సూచించారు.

## శ్రీమఠంలో విశేష పూజలు

**ప్రజాశక్తి - మంత్రాలయం**

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్ర స్వామి మఠంలో నరక చతుర్దశి సందర్భంగా పీఠాధిపతులు శ్రీసుబుధేంద్రతీర్థులు విశేష పూజలు నిర్వహించారు. ఆదివారం దీపావళి పండగ ముందు రోజు నరక చతుర్దశి సందర్భంగా పీఠాధిపతులు తైల అభ్యంగన స్నానం చేసి, శ్రీమఠంలో తులసి పూజ, గోపూజ వంటి విశేష పూజలతో రాఘవేంద్రస్వామి ఆరాధ్య దైవమైన మూల రాముల విగ్రహ మూర్తులను స్వర్ణ పీఠం ఉంచి క్షీరాభిషేకం, పుష్పార్చన చేశారు. అనంతరం రాఘవేంద్రుని మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. అంతకుముందు పీఠాధిపతుల పూర్వాశ్రమ తల్లి మంజులమ్మ, పూర్వాశ్రమ కుమారులు రాజా ఎస్.అప్రమేయాచార్ తైలంతో తలకు మర్దనం చేశారు.

# గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం

- దోమల స్వైర విహారం
- జ్వరాల విజృంభణ

**ప్రజాశక్తి-ఆదోనిరూరల్**

**ప్రస్తుత వాతావరణంలో మార్పులతో జ్వరపీడితుల సంఖ్య పెరుగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం పడకేయడంతో పరిస్థితి మరింత తీవ్రమవుతోంది. మురుగు కాలువల్లో పూడికను పూర్తిస్థాయిలో తొలగించడం లేదు. మరోవైపు దోమలు విజృంభిస్తున్నాయి. ప్రస్తుతం 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వం గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి పెట్టడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.**

మండలంలో 44 గ్రామాలకు గాను 37 పంచాయతీలు ఉన్నాయి. గ్రామాల్లో నివాసాల చెంత మురుగు నిలిచి ముందుకు కదలడం లేదు. పంచాయతీల్లో నిధుల కొరత వెంటాడుతోంది. పారిశుధ్య పనులను మొక్కుబడిగా చేసి మమ అనిపిస్తున్నారు. బ్లీచింగ్, సున్నం నామమాత్రంగా చల్లుతున్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాల్సి ఉన్నా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొరవడింది.

**ఎక్కడ చూసినా అంతే...**

మండలంలోని ఇస్వి, బల్లేకల్, పెద్దతుంబలం, మదిరె, సాంబగల్, సలకలకొండ, చిన్న పెండేకల్, ఆరెకల్, నాగలాపురం తదితర గ్రామాల్లో పరిశుభ్రత అధ్వానంగా మారింది. ఇస్వి గ్రామంలో డ్రెయినేజీలు సరిగా లేక ఇంటి ముందు మురుగు నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. పెద్దహరివాణం, పెద్దతుంబలం, నారాయణపురం, సంతేకుడ్లూరు, ఢణాపురం, చాగి, నాగనాథనహళ్లి, బసాపురం గ్రామాల్లోని కాలువల్లో వ్యర్థాలు నిండి మురుగు కదలడం లేదు. దోమల స్వైర విహారంతో గ్రామీణులు జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి పంచాయతీకి ఫాగింగ్ యంత్రాలు ఇచ్చినా సాంకేతిక లోపాలతో తరచూ మొరాయిస్తున్నాయి. చాలా గ్రామాల్లో దోమలు కాటేయడంతో ప్రజలు వణికిపోతున్నారు. జ్వరాలతో ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. రక్త పరీక్షలు, వైద్యం కోసం ఖర్చు తడిసిమోపెడవుతోంది.

ఇస్విలో ఇంటిముందు ప్రవహిస్తున్న మురుగునీరు

## 'వడ్డెరలకు ప్రాధాన్యత ఇవ్వాలి'

**ప్రజాశక్తి - నందవరం**

వడ్డెరలకు అన్ని రంగాల్లోనూ రాజకీయ పార్టీలు ప్రాధాన్యతను కల్పించాలని అఖిల భారత వడ్డె ఓబన్న సేవా సమితి సంఘం సభ్యులు వడ్డె బాల నరసింహులు, అడ్వకేట్ ఉరుకుంద, జిల్లా అధ్యక్షులు వరుసు శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం మండలంలోని నాగలదిన్నె గ్రామంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వడ్డెరలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే రాజకీయంగా ప్రాధాన్యత పొందుతారని తెలిపారు. వడ్డెరలకు ఓబన్న సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించుకుని, ఓబన్న అడుగుజాడల్లో నడిచేందుకు కృషి చేయాలని కోరారు. అనంతరం నాగలదిన్నె గ్రామ అఖిల భారత వడ్డే ఓబన్న సేవా సమితి సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులు వడ్డె శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు వడ్డె నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా వడ్డె భీమన్న, కమిటీ సభ్యులుగా వడ్డె బజారి, ఎల్లప్ప, బాలరాజు, కృష్ణ, జమ్మన్న, ఉరుకుంద, నాగార్జున పాల్గొన్నారు.

## దేవరగట్టులో ప్రత్యేక పూజలు

**ప్రజాశక్తి - హొళగుంద**

మండలంలోని నెరనికి, నెరనికి తండా, కొత్తపేట కొండ గుహల్లో వెలిసిన శ్రీమాల మల్లేశ్వర సన్నిధిలో సోమవారం దీపావళి అమావాస్య సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచి బారులుదీరి పూజలు చేశారు. అర్చకులు స్వామి వార్లకు బిల్వార్చన, కుంకుమార్చన, పూజలు చేశారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత అన్నదానం ఏర్పాటు చేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

# పార్లపల్లిలో చంద్రశేఖర్ రెడ్డి అనుచరుల

- మహిళపై అసభ్యకర ప్రవర్తన
- గతంలో ఎస్పీ హెచ్చరించినా బుద్ధి రాలేదంటున్న ప్రజలు

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్**

ఎమ్మిగనూరు మండలం పార్లపల్లి గ్రామంలో చంద్రశేఖర్ రెడ్డి అనుచరుల ఆగడాలకు హద్దు లేకుండా పోయిందని, అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తుల వివరాల మేరకు... పార్లపల్లిలోని సర్వే నెంబర్ 261లో గతంలో ప్రభుత్వం పట్టాలిచ్చింది. ఈ సర్వే నెంబర్‌లో 241 పట్టా నెంబర్ గల 0.3 సెంట్ల స్థలాన్ని కుమ్మరి సరోజమ్మకు ఇచ్చారు. సరోజమ్మ అదే గ్రామానికి చెందిన కుమ్మరి వెంకటేశ్వర్లుకు అమ్మేశారు. అదే పట్టాలో మూడు సెంట్లలో ఒకటిన్నర సెంటును తహశీల్దార్ ఇచ్చారని టోపీ నరసింహులు వచ్చి గొడవ చేస్తున్నారు. మొదట కమ్మరి సరోజమ్మకు పట్టా ఇచ్చారు ఆమె హైకోర్టుకు వెళ్లి స్టే తీసుకొచ్చారు. కుమ్మరి వెంకటేశ్వర్లు, టోపీ నరసింహులు కూడా చంద్రశేఖర్ రెడ్డి దగ్గరకు పంచాయితీకి వెళ్లారు. కుమ్మరి వెంకటేశ్వర్లు కొన్న మూడు సెంట్ల స్థలంలో బండలు పాతుకున్నారు. చంద్రశేఖర్ రెడ్డి టోపీ నరసింహులును రెచ్చగొట్టి బండలను పగులగొట్టి తన అనుచరులను రెచ్చగొట్టి పంపారు. ఆదివారం బండలు తీస్తున్న చంద్రశేఖర్ రెడ్డి అనుచరులను కుమ్మరి వెంకటేశ్వర్లు భార్య ఆపేందుకు వెళ్లారు. ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో గ్రామస్తులు విస్తుపోయారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం వారిపై చర్యలు తీసుకోకపోవడంతో ఇది అధికారుల నిర్లక్ష్యమేనని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ఇలాంటి ఘటనలు గతంలో కూడా జరిగాయని చెబుతున్నారు. గతంలో ఎస్పీ హెచ్చరించినా చంద్రశేఖర్‌రెడ్డికి బుద్ధి రావడం లేదని పేర్కొంటున్నారు.

అసభ్యంగా ప్రవర్తిస్తున్న చంద్రశేఖర్ రెడ్డి అనుచరులు

మాట్లాడుతున్న విఒఎల యూనియన్ నాయకులు

## విఒఎల సమస్యల పరిష్కారానికి కృషి

- విఒఎల యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షులు ప్రభుదాస్

**ప్రజాశక్తి - గోనెగండ్ల**

రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న విఒఎల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వైకెపి, విఒఎల యూనియన్ వ్యవస్థాపకులు ప్రభుదాస్ తెలిపారు. సోమవారం గోనెగండ్లలోని వెలుగు కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అతిథులుగా ప్రభుదాస్, జిల్లా అధ్యక్షులు బసవరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విఒఎలకు ఉద్యోగ భద్రత కల్పించేందుకు హెచ్‌ఆర్ పాలసీ వర్తింపజేయాలని కోరారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సీనియర్ విఒఎలకు సిసిలుగా పదోన్నతి కల్పించాలని ప్రభుత్వానికి సిఫారసు చేశామన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి విఒఎలకు ప్రతినెలా గౌరవ వేతనం రావడం సంతోషించదగ్గ విషయమని తెలిపారు. అనంతరం నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆరెకల్ రవికుమార్, ఉపాధ్యక్షులుగా మిన్నెల్లాతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. జిల్లా కోశాధికారి పద్మావతి, కడప జిల్లా కార్యదర్శి నాగరాజు, కర్నూలు జిల్లా గౌరవ సలహాదారులు రామలింగప్ప, ఆయా మండలాల అధ్యక్ష, కార్యదర్శులు లోక్‌నాథ్ రెడ్డి, విజయ భాస్కర్, బాలస్వామి, తిక్కన్న, వరలక్ష్మి, మౌలాలి పాల్గొన్నారు.

## ఘనంగా వినాయక విగ్రహ ప్రతిష్ఠాపన

**ఆదోని :** ఆదోనిలోని నెహ్రూ మెమోరియల్ మున్సిపల్ హైస్కూల్ 1983-84 పదో తరగతి బ్యాచి విద్యార్థులు స్కూల్ ఆవరణలో ఆదివారం సరస్వతి, వినాయక స్వామి విగ్రహాలు ప్రతిష్ఠించారు. రెండో వార్షికోత్సవం సందర్భంగా అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూర్వపు విద్యార్థులు కె.నాగరాజు, గురుమూర్తి, నరసరెడ్డి, హనుమంత రావు, కృష్ణ కుమార్, ప్రసాద్, మల్లేష్, కృష్ణమూర్తి, వైకుంఠవాసులు, నాగరాజు, రఫీక్, ఈరన్న, రంగ

**MISSING PASSPORT**

డి.రాహుల్ S/o. డి.సుధాకర్ R/o. 39/284, వడ్డేగేరి, సంగం ఆఫీస్ దగ్గర, కర్నూలు అర్బన్ & మండలం కర్నూలు జిల్లా వారి P7478974 నెంబర్ గల Passport తేది 09-11-2023 న ఉదయం బయటకు వచ్చునపుడు,Passport డిమార్ట్, బళ్లారి చౌరస్తా కర్నూలులో పోయినది. దొరికిన వారు ఈ క్రింద అడ్రస్ ఇవ్వగలరు.

**డి.రాహుల్ S/o. డి.సుధాకర్**
సెల్ : 8639686316

**డాక్యుమెంట్ పోయినది**

నేను అనగా వడ్డే వీరేశమ్మ అను నేను పత్రికా ప్రకటన ద్వారా మనవి చేయడం ఏమనగా 30/10/2023 తేదీన కైరుప్పల నుండి పత్తికొండ సబ్ రిజిష్టర్ కార్యాలయంకి ఆటోలో వెళ్తుండగా పత్తికొండ బస్టాండ్ దగ్గర నాయొక్క డాక్యుమెంట్ పడిపోయింది. కావున ఈ డాక్యుమెంట్- డాక్యుమెంట్ నెం. 1414/2011, సర్వే నెం.64/1. ఎవరికైనా దొరికినచో దయచేసి నా అడ్రస్ కు తెలియజేయగలరు. అందచేసిన వారికి తగిన పారితోషికం ఎవ్వబడును.

**వడ్డే వీరేశమ్మ, భర్త : లేట్ రాముడు**
**ఇ.నెం.1/68, బి.సి కాలనీ, కైరుప్పల గ్రామం,**
**అస్పరి మండలం, కర్నూల్ జిల్లా. సెల్: 8142298720.**

**IN THE COURT OF PRINCIPAL JUNIOR CIVIL JUDGE : DHONE**
**O.S.No.106/2023**

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు వెల్దుర్తి మేనేజర్. ...వాది

**వర్సెస్**

బండారి నాగేంద్ర
తండ్రి బండారి తిప్పన్న @ చిన్న తిప్పన్న,
చెర్ల కొత్తూరు గ్రామం, వెల్దుర్తి మండలం,
కర్నూలు జిల్లా. ...ప్రతివాది నెం.2

**ప్రతివాదికి సమన్స్**

పై దావాను బ్యాంకు వారి అప్పును రాబట్టుకొనుటకు మీపై దావా వేసినారు. నీవు కోర్టు వారు పంపిన సమన్స్ తీసుకొనక తప్పించుకొనుచున్నావు కావున నీవు 20/12/2023 వ తేదీన పైకోర్టు నందు ఉదయం 10:30 గంటలకు నీవు కానీ నీ తరపు లాయర్ ద్వారా హాజరై ఆక్షేపణలు ఉన్న ఎడల తెలుపుకొనవచ్చును లేనంతట నీ పరోక్షమందు తీర్మానించబడును.

**(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)**

**వాయిదా 20/12/2023**

**M.Gopal Reddy,**
Advocate,
Dhone, Nandyal Dist.
Cell : 9440557898

టపాకాయలు కాలుస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి కుటుంబ సభ్యులు

# గుర్తింపునకు నోచని కౌలు

**- రుణ అర్హత కార్డుల జారీలో జాప్యం**
**- కౌలు రైతులకు అందని ప్రయోజనాలు**

**ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి**

కౌలు రైతులు కనీసం గుర్తింపునకు కూడా నోచుకోవడం లేదు. కౌలు రైతులకు అందించాల్సిన రుణ అర్హత కార్డుల జారీలో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో ప్రభుత్వం నుంచి అందాల్సిన ప్రయోజనాలు కౌలు రైతులకు అందడం లేదు...

వాస్తవ సాగుదారుడైన కౌలు రైతులను ప్రభుత్వం పట్టించుకోని పరిస్థితి నెలకొంది. '2019 పంట సాగుదారు హక్కుచట్టం' తెచ్చి కౌలురైతులకు ప్రభుత్వ సాయం ఏ ఒక్కటీ అందకుండా చేసింది. దీంతో కౌలురైతులు వ్యవసాయ సాగులో తీవ్రంగా నష్టపోతున్నారు. రెండు లక్షల మందికిపైగా కౌలురైతులు ఉమ్మడి జిల్లాలో ఉన్నారు. 2011 భూఅధీకృత సాగుదారుని హక్కు చట్టంతో కౌలు రైతులకు కొన్ని హక్కులు కల్పించారు. భూయజమానితో సంబంధం లేకుండా కౌలుకార్డు జారీచేసి బ్యాంకు రుణాల నుంచి ప్రభుత్వం అందించే ప్రతి సాయం కౌలురైతులకు అందేలా చట్టంలో పేర్కొన్నారు. దీంతో అధికారులు కౌలుకార్డులు ఇవ్వకపోతే రైతుసంఘాల ఆధ్వర్యంలో రైతులు రోడ్డెక్కి ఆందోళనలు నిర్వహించి సాధించుకునేవారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత 2011 కౌలుచట్టంలో ఏకపక్షంగా మార్పులు చేసేసింది. దాని స్థానంలో 2019 పంట సాగుదారు హక్కుచట్టం తెచ్చింది. ఈ చట్టంలో భూయజమాని అంగీకారం లేకుండా కౌలు రైతులకు సిసిఆర్‌సి(కౌలుకార్డు) ఇవ్వకూడదని తెలిపింది. సిసిఆర్‌సి కార్డు లేకుంటే బ్యాంకు రుణం నుంచి బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు భరోసాతో పాటు చివరికి ధాన్యం అమ్ముకునే పరిస్థితి కూడా కౌలు రైతులకు లేకుండాపోయింది. కౌలు కార్డులు కూడా అరకొరగా మంజూరు చేస్తున్నారు. కార్డులు ఇచ్చినవారికి కూడా బ్యాంకు రుణాలుగాని ప్రభుత్వ సాయం పూర్తిస్థాయిలో అందని పరిస్థితి నెలకొంది.

**పట్టించుకునేవారేరీ..**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 70శాతానికిపైగా వ్యవసాయ సాగు కౌలు రైతులే చేస్తున్నారు. తమ భూములు కౌలుకిచ్చేసి భూయజమానులంతా వ్యాపారాలు చేసుకుంటున్నారు. వాస్తవ సాగుదారుడైన కౌలు రైతులకు అందించాల్సిన సాయం మాత్రం సాగుచేయని భూయజమానులకే ప్రభుత్వం అందిస్తోంది. నిబంధనల ప్రకారం పంటరుణం సాగుచేసే రైతుకు అందించాలి. భూయజమానికి పంటేతర రుణం ఇవ్వాల్సి ఉంటుంది. అయితే బ్యాంకులు కౌలు రైతులకు పంటరుణాలు ఇవ్వడం లేదు. రైతు మిత్ర గ్రూపులకు అరకొరగా రుణాలిచ్చి అవే కౌలురైతులకిచ్చిన రుణాలుగా కాగితాల్లో చూపిస్తున్నారు.

# ఘనంగా దీపావళి వేడుకలు

**ప్రజాశక్తి - బనగానపల్లె**

మండలంలో ప్రజలు దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి పట్టణంలోని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నివాసంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కుటుంబ సభ్యుల మధ్య దీపావళి పండుగ జరుపుకున్నారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆయన సతీమణి కాటసాని జయమ్మ, వారి కుమారుడు కాటసాని ఓబుల్ రెడ్డి , కోడలు కాటసాని మేధా శ్రీ రెడ్డి కార్యకర్తల మధ్య ఎదీపావళి వేడుకలను జరుపుకున్నారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ దీపావళి పండుగ రాష్ట్రంలోని ప్రజలు జీవితాల్లో కాంతులు వెదజల్లాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. 2024లో మళ్ళీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి, ఎమ్మెల్యేగా తాను అఖండ మెజార్టీతో విజయం సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. **సంజామల** :సంజామల మండల ప్రజలు దీపావళి పండు గను ఘనంగా జరుపుకున్నారు. బాల బాలికలు ఉదయం నుంచి రాత్రి వరకు బాణసంచా కాల్చుతూ సంబరాలు చేసుకున్నారు. మహిళలు రాత్రికి దీపాలు వెలిగించారు.

# క్రీడాకారులకు చేయూత

**ప్రజాశక్తి - చాగలమర్రి**

చాగలమర్రి పట్టణంకు చెందిన బేస్బాల్ క్రీడాకారులు అయిన అబు బాకర్,అల్తాఫ్, జుబెర్, షాహిద్‌లకు జాతీయస్థాయి బేస్ బాల్ పోటీలకు రాష్ట్ర జట్టు తరఫున పాల్గొనుటకు అవసరమైన ఆర్థిక సహాయమును ప్రముఖ పారిశ్రామికవేత్త, చక్రం బీడీ అధినేత ముల్లా షబ్బీర్ అహ్మద్ 15 వేల రూపాయల నగదు క్రీడాకారులకు అందజేసినట్లు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పిడి దాదా పీర్ తెలిపారు. ఈ క్రీడాకారులు ఈనెల 2న నెల్లూరు జిల్లా కసుమూరు నందు జరిగినటువంటి ఎంపిక పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. వీరు ఈనెల 23వ తేదీ నుంచి పంజాబ్ రాష్ట్రం నందు జరగబోతున్న జాతీయస్థాయి బేస్బాల్ పోటీల్లో మన రాష్ట్ర జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తారు. ఎంపికైన క్రీడాకారులను ముల్లా షబ్బీర్ అహ్మద్ అభినందిస్తూ జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి మన రాష్ట్రానికి, మన జిల్లాకు, మన గ్రామానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని అలాగే విజయం సాధించి పతక ంతో రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పిడి దాదా పీర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

## అసమానతలు లేని అభివృద్ధి కోసం

# ప్రజారక్షణ భేరి

**- విజయవంతం చేయండి : సిపిఎం**

బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్

**ప్రజాశక్తి - నంద్యాల**

రాష్ట్రంలో అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన విజయవాడలోని అజిత్ సింగ్ నగర్ ఎంబి స్టేడియం నందు ప్రజారక్షణ భేరిని లక్ష మందితో భారీ బహిరంగ సభ జరగబోతుందని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి టి రమేష్ కుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం ఎన్జీవోస్ కాలనీ సిపిఎం ఆఫీస్ నుండి భారీ బైక్ ర్యాలీని టి రమేష్ కుమార్ జెండా ఊపి ప్రారంభిం చారు. ఈ బైక్ ర్యాలీ ఎన్జీవోస్ కాలనీ, నూనెపల్లి మీదుగా తాలూకా ఆఫీస్, పద్మావతినగర్, శ్రీనివాస్ సెంటర్ సంజీవనగర్ గేట్ మీద, బస్టాండ్ గాంధీ చౌక్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి టిరమేష్ కుమార్ మాట్లాడుతూ ఈ బహిరంగ సభతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సిపిఎం ఒక సవాలు విసరబోతోందన్నారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రెండు కలిసి రాష్ట్రాన్ని నాశనం చేస్తున్నాయ న్నారు. రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యేక హోదా 15 సంవత్సరాల ఇస్తామని చెప్పిన బిజెపి మాట తప్పిందన్నారు. 25 మంది ఎంపీలు ఇవ్వండి కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి ప్రత్యేక హోదా సాధిస్తా నన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత నేటి ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి నేడు బిజెపి మోచేతి నీళ్లు తాగుతున్నాడన్నారు. కేంద్ర ప్రభుత్వానికి జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర మొత్తం దోచిపెడుతున్నాడని, రాష్ట్రానికి దిక్సూచిగా ఉండే విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం అమ్మాలని చూస్తున్నా సిఎం జగన్ మాత్రం నోరు ఎత్తడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో ఉన్న పోర్టులన్నీ ఆదానికి అప్పజెప్పారని, అదేవిధంగా పోలవరం ప్రాజెక్టును ఇంతవరకు పూర్తి చేయలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం నుండి ప్రత్యేక హోదా విభజన హామీలను ఇంతవరకు జగన్మోహన్ రెడ్డి సాధించుకోలేక పోయా డన్నారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రజల పైన కరెంటు బిల్లుల మోత, ఇంటి పన్ను, చెత్త పన్ను, ఆస్తి విలువ ఆధారిత పన్ను, విద్యుత్ చార్జీల మోత ఈ విధంగా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజల పైన బారాల మీద భారాలు వేస్తూ రాష్ట్రాన్ని నాశనం చేస్తున్నా డన్నారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తులను రెగ్యులర్ చేస్తానని ఇంతవరకు అమలు చేయలేదని, ఉద్యోగస్తులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తానని మాట తప్పడన్నారు. కర్నూలుకు హైకోర్టు ఇస్తామని చెప్పి ఇంతవరకు దానిని అమలు చేయలేదని, మూడు రాజధానుల పేరిట రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశాడన్నారు. ఇటువంటి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి సిపిఎం సవాల్ చేస్తూ అసమానతలు లేని అభివృద్ధి సిపిఎంతోనే అవుతుందని చెప్పడానికి ప్రభుత్వానికి సవాల్ చేస్తూ ఈ బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. ఈ బహిరంగ సభకు వేలాది మంది ప్రజలు నంద్యాల నుండి హాజరవుతున్నారన్నారు. సమస్యలతో బాధపడే ప్రజలందరూ ఈ సభకు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహులు పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు కే యం డి గౌస్, లక్ష్మణ్, వెంకట లింగం, సిపిఎం సీనియర్ నాయకులు తోట మద్దులు, పట్టణ కమిటీ నాయకులు జైలాన్, సుబ్బారావు, సాయి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు. **బేతంచర్ల :** ప్రజా రక్షణ భేరి మహాసభను జయప్రదం చేయాలని బేతంచెర్ల పట్టణ సిపిఎంకార్యదర్శి వైబి వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు వై ఎల్లయ్యలు కోరారు. సిపిఎం కార్యాలయం నందు ఎస్ సాదిక్ హుస్సేన్ అధ్యక్షతన లారీ మోటార్ వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. రవాణా రంగ కార్మికులకు ప్రమాదకరమైన జీవో నెంబర్ 21 రద్దు చేయాలని, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, భారీగా పెంచిన ఫీజులు పెనాల్టీలు తగ్గించాలని బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత రవాణా రంగంను ఆదాయ వనరుగా భావించి తీవ్రమైన బారాలు మోపుతుందని, తదితర సమస్యలపై రవాణా రంగ కార్మికులకు పోరాటం తప్ప మరో మార్గం లేదన్నారు. విజయవాడలో జరిగే సిపిఎం ప్రజారక్షణ భేరి మహా బహిరంగ సభకు డ్రైవర్లు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కమిటీ సభ్యులు జై శ్రీనివాసులు, సిహెచ్ మద్దిలేటి స్వామి, ఏ మాదన్న, ఎస్ వెంకటేశ్వర్లు, ఫణీంద్ర, రాముడు,కే మధు, రాజు, వెంకట్ రాముడు, గోరంట్ల, మధు, అసన్ బాష, పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

# గ్రామ అభివృద్ధికి కృషి చేయాలి : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి - బనగానపల్లె**

ప్రజల అభిమానాన్ని చురగొని గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నివాసంలో అవుకు మండలం రామాపురం గ్రామ నూతన సర్పంచిగా ఎన్నికైన బందెల రాము ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పూలమాలలతో సత్కరించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చి అందులో భాగంగా రెండున్నర సంవత్సరాల కాలం తర్వాత బందేల రామును నూతన సర్పంచ్‌గా ఎన్నుకోవడం జరిగిందని చెప్పారు. గ్రామంలో అందరూ కలిసి మెలిసి గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించుకోవా లని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో రామా పురం గ్రామ వైసిపి నాయకులు రామ సుబ్బారెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, రామారావు, రామచంద్రుడు, సీతయ్య, భాస్కర్ రెడ్డి, గిరి, మధు, కనకయ్య, జయరాజు, కన్నయ్య, దేవదాసు, శ్రీరాముల కుమా ర్, అరుణ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సన్మానిస్తున్న రామాపురం నూతన సర్పంచ్

## మహిళను దూషించిన వ్యక్తిపై ఎస్‌సి, ఎస్‌టి కేసు

**ప్రజాశక్తి - పాములపాడు**

దళిత మహిళను కులం పేరుతో దూషించి కొట్టిన వ్యక్తిపై ఎస్‌సిఎస్‌టి కేసు నమోదు చేసినట్లు పాములపాడు ఎస్సై జి అశోక్ తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల మేరకు పాములపాడు మండలం మద్దూరు మజార గ్రామం కృష్ణ నగర్ గ్రామానికి చెందిన ఓ దళిత మహిళకు మద్దూర్ మజార గ్రామం పెంచికల పల్లె గ్రామా నికి చెందిన శ్రీనివాస గౌడ్ రూ.2,50,000 అప్పుగా ఇచ్చాడని దానికి సంబంధించి ప్రామిసరీ నోటు దళిత మహిళ రాసి ఇచ్చింది. ఈనెల ఆరవ తేదీన ఆ మహిళ పొదుపు మహిళలతో కలిసి పొదుపు మీటింగ్‌కు ఆటోలో వెళుతుండగా శ్రీనివాసులు గౌడ్ ఆటోను ఆపి అప్పు చెల్లించాలని మహిళను కులం పేరుతో దూషించి చేతులతో కొట్టి అవమానపరిచారని మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## బియ్యం తరలిస్తున్న వాహనం సీజ్

**ప్రజాశక్తి - మిడుతూరు**

అక్ర మంగా తరలిస్తున్న బియ్యాన్ని 70 బస్తాలను బులోరా వాహనంలో మిడ్తూర్ గుండా తరలిస్తుండగా వాహనాన్ని పట్టుకు న్నట్లు ఎస్సై జగన్మోహన్ తెలిపారు. ఆత్మకూరు మండ లంలోని అమలాపురం నుండి తరలిస్తుం డగా వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. ముద్దాయిలను కాజా మొద్దీన్, సద్దాం హుస్సేన్, ఇరుగుండి అరెస్టు చేసి ఇంకా ముద్దా యిలు ఉన్నారని వారిని త్వరలో పట్టుకుంటామని ఎస్సై తెలిపారు.

సీజ్ చేసిన వాహనం

# ముందుస్తు గుర్తిస్తే చెక్కెర వ్యాధికి చెక్

**- నేడు ప్రపంచ మధుమేహ దినోత్సవం**



**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

**ప్రపంచంలో షుగర్ వ్యాధి అనేది ప్రజలను పట్టిపీడిస్తున్న సమస్యగా మారింది. ఈ వ్యాధి పట్ల జాగ్రత్త వహించకుంటే మనిషిని అట్లే తినేస్తుంది. అనేది వైద్యుల అభిప్రాయం.. షుగర్ వ్యాధిని ఎప్పటికప్పుడు సీఏ జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు అంటున్నారు. 2045 కల్లా షుగర్ వ్యాధి సోకే అవకాశాలు ఉన్నట్లు వైద్య వర్గాలు హెచ్చ రిస్తున్నాయి.. దీనికి కారణం 90 శాతం మంది పట్టణ ప్రాంతాల్లో వచ్చి చేరడం.. శారీరక శ్రమ లేకపోవడం.. అధిక బరువు కాయం వంటి వాటితో సతమతం అవడం.. ముందు జాగ్రత్తలు తీసుకోకపోవడం వంటి చర్యలు షుగర్ వ్యాధికి ఉపక్రమిస్తుందని అభిప్రాయం వ్యక్తం అవుతుంది.. షుగర్ వ్యాధిపై మాక్స్ వెల్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్. రాజ్ కుమార్ ప్రపంచ మధుమేహం దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తితో ఆయన తన అభిప్రాయాలను పంచుకోవడంతో పాటు వ్యాధి లక్షణాలను నివారణ చర్యలను వివరిం చారు. మరిన్ని విషయాలు ఆయన మాటల్లోనే..**

మధుమేహం అనేది అధిక రక్త చెక్కర స్థాయిలను కలిగి ఉన్న రోగులకు ఉండే దీర్ఘకాలిక రుగ్మతే. ఇది మూత్రపిండాల వైపల్లెము గుండె జబ్బులు మొదలైన తీవ్రమైన సమస్యలకు దారి తీయగలదు. జీవనశైలిలో మార్పులు చేయడం ద్వారా మధుమేహాన్ని నివారించవచ్చు లేదా కనీసం ఆలస్యం చేయవచ్చు.

**మధుమేహం లక్షణాలు**

మధుమేహం అనేది నెమ్మదిగా పురోగమించే వ్యాధి. లక్షణాలు స్వల్పంగా ఉండవచ్చు. విపరీ తమైన ఆకలి విపరీతమైన దాహం. వివరించలేని బరువు తగ్గడం. తరచుగా మూత్ర విసర్జన గాయాలు నెమ్మదిగా నయం కావడం. చేతులు లేదా పాదాలలో తిమ్మిరి లేదా జల దరింపు.. దృష్టి మసకబారటం వంటి లక్షణాలు ఉంటాయి.

**నివారణ చర్యలు**

జీవన శైలిని మార్చుకోవాడడంతో మధుమేహం నివారణకు ఇది ఒక పెద్ద అడుగు కావచ్చు. నివారణ ప్రారంభించడానికి ఎన్నడూ అది ఆలస్యం అవదు. మధుమేహం వచ్చే ప్రమాదాన్ని తగ్గించడానికి కొన్ని మార్గాలు ఉన్నాయి.. అందులో

- ఆరోగ్యకరమైన సమతుల్య ఆహారాన్ని తీసుకోవడం.

చక్కెరతో ఉప్పగా ఉండే ఆహారము పానీ యాలు ఎక్కువగా తీసుకోవడం మానుకోవాలి.

ఆరోగ్యకరమైన బిఎంఐని నిర్వహించాలి.

- ఆహారంలో తృణధాన్యాలు పండ్లు కూరగా యలను ఎక్కు వగా తీసుకోవాలి.
- శారీరక శ్రమ వ్యాయమం ఆరు బయట కార్యకలాపాలను ప్రోత్సహించాలి.
- నీరు పుష్కలంగా తాగాలి కోలాలు జ్యూస్‌లను నివారించాలి.
- శారీరక శ్రమను పెంచడంతోపాటు అధిక బరువు తగ్గడానికి ప్రయత్నం చేయాలి.
- రక్తంలో గ్లూకోజ్ రక్తపోటు కొలెస్ట్రాల్ స్థాయిలను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలి.
- తగినంత నిద్ర పోవాలి, ధూమపానం విడిచిపెట్టాలి మద్యం సేవిం చడం మాను కోవాలి. రోజువారి జీవితంలో ఒత్తిడిని తగ్గించాలి.
- తల్లిదండ్రుల కోసం నివారణ చిట్కాలు. పోషక విలువలు గల చిరుతిళ్లు అందించాలి జంక్ ఫుడ్ నివారించాలి..

ప్రపంచ మధుమేహ దినోత్సవం 2023 థీమ్ ఈ సంవత్సరం, 2023, ప్రపంచ మధుమేహ దినోత్సవం థీమ్ "డయాబెటిస్ కేర్ యాక్సెస్". సకాలంలో చికిత్స, నిర్వహణను నిర్ధారించడానికి సరైన సమాచారం, అవసరమైన సంరక్షణకు సమాన ప్రాప్యతను కలిగి ఉండటం ప్రాముఖ్యతను ఈ థీమ్ హైలైట్ చేస్తుంది.

**ఈ ఏడాది మధుమేహం 2023 థీమ్ ...**

ఈ సంవత్సరం 2023 థీమ్ హెల్త్‌కేర్ నిపుణులు మధు మేహంతో జీవిస్తున్న వ్యక్తుల కోసం ఇంటెన్సివ్ డయాబెటిస్ విద్యపై దృష్టి సారించింది, ఇది నాణ్యమైన విద్యా వేదికకు మెరుగైన ప్రాప్యతను అందిస్తుంది, ఇది ముందస్తు గా రోగనిర్ధారణకు అవగాహన కల్పించడం, ప్రోత్సహించడం, మెరుగైన జీవనశైలి ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న మధు మేహం వ్యాప్తిపై పోరాడటానికి నివారణ చిట్కాలను పాటించాలి.

వైద్యశాల సిబ్బందితో కేంద్ర బృందం

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కేంద్ర బృందం

**ప్రజాశక్తి - పగిడ్యాల**

మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కొణిదెల ఆరోగ్య ఉపకేంద్రాని ఆదివారం కేంద్ర బృదం సందర్శించింది. ఈ సందర్భంగా కేంద్ర బృందం సభ్యులు మాట్లాడారు. కొణిదెల ప్రాథమిక ఉపకేంద్రం పరిధిలోని కుటుంబాలను వారు సందర్శించారు. ప్రజలకు సరైన వైద్య సేవలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆరోగ్య సేవలను మరింత పటిష్టం చేసేందుకే అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం పగిడ్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహానంది ఆలయ దర్శన వేళల్లో మార్పు : ఇఒ

**ప్రజాశక్తి - మహానంది**

కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా మహానంది ఆలయ దర్శన వేళల్లో మార్పులు చేసినట్లు ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. కార్తీకమాసం సందర్భంగా ఈ ఏర్పాట్లపై దేవస్థానం కార్యనిర్వహణ అధికారి కాపు చంద్ర శేఖర్ రెడ్డి సోమవారం నాడు ఆయా సెక్షన్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం ఆది సోమవారాల్లో ఉదయం తెల్లవారుజామున నాలుగు గంటల నుండి రాత్రి పది గంటల 30 నిమిషాల వరకు మిగతా రోజుల్లో ఉదయం 5 గంటల నుండి తొమ్మిది గంటల 30 నిమిషాల వరకు స్వామి అమ్మవార్లను భక్తులు దర్శించుకోవడానికి వీలుగా ఆలయ దర్శన వేళల్లో మార్పు చేసినట్లు పేర్కొన్నారు. దీంతోపాటు నవంబర్ 26న కార్తీక పౌర్ణమి సందర్భంగా సాయంత్రం జ్వాలాతోరణ కార్యక్రమం నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. చేపట్టవలసిన ఏర్పాట్లు అన్ని ముందస్తుగానే పూర్తి చేయాలని సూచించారు. లడ్డు ప్రసాదాలు కోనేరు స్నానాలకు ఏర్పాట్లు, కేశఖండనశాలలో ఏర్పాట్లు సూచిక బోర్డులు ఈ మాసంలో శివసప్తహ భజనలు వంటి ఏర్పాట్లపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు వేద పండితులు, పాలక మండలి చైర్మన్,సభ్యులు, దేవాలయాల ప్రధాన అర్చకులు పాల్గొన్నారు.

# మంద విజయ్ కుమార్‌పై దాడి అమానుషం : బిసి

**ప్రజాశక్తి - బనగానపల్లె**

కొలిమిగుండ్లకు చెందిన నియోజకవర్గ తెలుగు యువత అధికార ప్రతినిధి మంద విజయ కుమార్‌పై దాడి అమానుషమని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బీసీ మాట్లాడుతూ తెలుగు యువత అధికార ప్రతినిధి మంద విజయ కుమార్‌పై వైసిపి నాయకులు నాగేశ్వర రావు, అతని అనుచరులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ తెలుగు యువత అధికార ప్రతినిది మంద విజయ్ కుమార్‌ను తన ఇంటి మీదికి వెళ్లి వైసిపి నాయకులు నాగేశ్వర రావు, ఆతని అనుచరులు కలిసి మంద విజయ్ కుమార్‌ను తన ఇంటి నుంచి మెయిన్ రోడ్డులో దాదాపు 1 కిమీ వరకు దారుణంగా హింసాత్మకంగా చెప్పులతో తన్నుకుంటూ పోలీస్ స్టేషన్ వరకు తీసుకెళ్లినట్టు తెలిపారు. పోలీస్ స్టేషన్ వద్ద కూడా దారుణంగా చితకబాది తిరిగి అతనిమీదనే అక్రమ కేసు బనాయించి పోలీస్ స్టేషన్‌లో వేసిన దారుణమైన సంఘటన చోటుచేసుకుందని తెలిపారు. మంద విజయ్ కుమార్ తెలుగు దేశం పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనడం, హైదారాబాద్‌లో జరిగిన ఎంఆర్‌పిఎస్ సభకు తన కులము వారిని అధిక సంఖ్యలో తరలించడంతో జీర్ణించుకోలేక వైసిపి నాయకుడు నాగేశ్వర రావు తన అనుచరులతో దాడి చేసినట్లు మాజీ ఎమ్మెల్యే తెలిపారు. వైసిపి నాయకులు దాడి చేసి మంద విజయ్ కుమార్‌పై అక్రమంగా కేసు పెట్టారని విమర్శించారు. నాగేశ్వర రావు చేస్తున్న అక్రమ పనులు, భూ కబ్జాలపై సోషల్ మీడియాలో పెట్టి, కేసు పెట్టడంతో విజయ్ కుమార్‌పై దాడి చేశారని తెలిపారు. విజయ్ కుమార్‌పై దాడి చేసిన నాగేశ్వరరావు అతని అను చరులపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని మాజీ ఎమ్మెల్యే బీసీ డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి

# పుస్తక పఠనంతోనే మేధాశక్తి : ఎమ్మెల్యే

గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

**ప్రజాశక్తి - బనగానపల్లె**

పుస్తక పఠనంతోనే మేధాశక్తి పెరుగుతుందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నివాసంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల వాల్ పోస్టర్‌ను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి విడుదల చేశారు. ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ వారోత్సవాల పోస్టర్లను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, గ్రంథాలయ అధికారి బషీర్ అహ్మద్‌లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ ఆనాటి మేధావులు పుస్తక పఠనం వలనే మేధావులుగా చరిత్రకెక్కినారని తెలిపారు. నేటి కంప్యూటర్ యుగంలో పని ఒత్తిడి వల్ల మనిషి ఒత్తిడికి లోనవుతున్నాడని ప్రతిరోజు మనిషి కొంత సమయం కేటాయించి పుస్తక పఠనం చేసినట్లయితే మనిషి కూడా ఒత్తిడి లోను కాకుండా ఉంటారని తెలిపారు. అన్ని రకాల పుస్తకాలు ఒకే చోట లభించేదే గ్రంథాలయంలో మాత్రమే లభిస్తాయన్నారు. గ్రంథాలయ అధికారి బషీర్ హమ్మద్ మాట్లాడుతూ 14వ తేదీన బాలల దినోత్సవం నెహ్రూ పుట్టినరోజు కార్యక్రమముతో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవములను ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. 15వ తేదీ పుస్తక ప్రదర్శన కార్యక్రమము, 16వ తేదీ గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న పితామహులను స్మరించు కార్యక్రమం, 17వ తేదీన స్వాతంత్ర పోరాటంపై స్వాతంత్ర సమరయోధుల ప్రసంగలు, 18వ తేదీన విద్యార్థిని, విద్యార్థులకు వ్యాసరచన వక్తృత్వ పోటీలు, చిత్రలేఖనం , క్విజ్ పోటీలను నిర్వహిం చడం జరుగుతుందనితెలిపారు. 19వ తేదీన మహిళా దినోత్సవం కార్యక్రమంలో భాగంగా దిశా చట్టం, మహిళా సాధికారతపై చర్చ నిర్వహిం చనున్నట్లు తెలిపారు. 20వ తేదీన అక్షరాస్యతా దినోత్సవం డిజిటల్ లైబ్రరీల వినియోగం పై ధోరణి స్వీయ పఠనం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిం చడం జరుగుతుందని వీటిని విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, నాయకులు రామాపురం రామారావు, చెరువు పల్లె రామసుబ్బయ్య గౌడ్, చెరువు పల్లె నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

**ఆత్మకూరు :** ఆత్మకూరులోని గ్రంథాలయంలో 56వ గ్రంథాలయ వారోత్సవాలను జయప్రదం చేయాలని ఆత్మకూరు గ్రంథాలయ అధికారి యన్. రాకేష్ అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నా మని తెలిపారు. వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తా మన్నారు. విద్యార్థులు పెద్దలు, గ్రంథాలయ వారోత్సవాలలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

**సంజామల :** నేటి నుంచి 20వ తేదీ వరకు 56వ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు గ్రంథాల అధికారి భారతి మారెడ్డి తెలిపారు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు క్విజ్ డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు బాల తిమ్మారెడ్డి తెలిపారు

**పాణ్యం:** నేటి నుండి 56 వ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు గ్రంథాల య అధికారిని భాగ్యలక్ష్మి తెలిపారు. యాజమాన్య పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీ లు, చిత్ర లేఖనం, సెమినార్లు,పుస్తక పఠనం, మహి ళా దినోత్సవం జరుపుతున్నట్లు ఆమె తెలిపారు.

**ఆళ్లగడ్డ:** ఆళ్లగడ్డ శాఖ గ్రంథాలయంలో ఈనెల 14 నుంచి 20 వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి అరుణ కుమారి తెలిపారు. సోమవారం వారు మాట్లాడు తూ వారోత్సవాల సందర్భంగా ప్రతిరోజు ఒక కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. గ్రంథాలయ వారోత్సవాలలో విద్యార్థులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని గ్రంథాలయ అధికారి అరుణ కుమారి కోరారు.

కరపత్రాలను అందజేస్తున్నఉపసర్పంచ్ షేక్ సోహెల్

## ప్రజా తీర్పు కోసమే జనంలోకి : వైసిపి

**ప్రజాశక్తి - చాగలమర్రి**

జగనన్న ప్రజా రంజక పాలనపై ప్రజా తీర్పు కోసం జనంలోకి వెళ్తున్నామని చాగలమర్రి మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ షేక్ సోహెల్ తెలిపారు. పట్టణంలోని 2వ సచివాలయ పరిధిలోని 6వ వార్డులో సోమవారం ఆయన ఆంధ్ర ప్రదేశ్‌కి జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న ఆదేశాల మేరకు తమ ప్రభుత్వం చేపట్టిన వివిధ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్నామన్నారు. ప్రజలకు కరపత్రాలు ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మన్సూర్, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ అబ్దుల్లా, సచివాలయాల కన్వీనర్లు గృహ సారథులు వాలంటీర్లు వైయస్సార్ కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆర్థర్

## కోమాలోకి వెళ్లిన గర్భిణీ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే

**ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్**

నందికొట్కూరు పట్టణానికి చెందిన షేక్ జరీనాబి ప్రసవ వేదనలో ఉండగా బి.పి ఎక్కువయ్యి కోమాలోకి వెళ్లారు. ఆమె ఆరోగ్య పరిస్థితి ప్రమాదకరంగా ఉందని వారి కుటుంబ సభ్యులు ఆందోళనతో ఎమ్మెల్యే తోగూర్ ఆర్థర్‌కి ఫోన్ ద్వారా విషయాన్ని తెలుపగా స్పందించిన ఎమ్మెల్యే ఆర్థర్ వెంటనే సోమవారం నాడు కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి కోమాలో ఉన్న గర్భిణీని సందర్శించి వైద్యులతో ఆమె ఆరోగ్య పరిస్థితిలను గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సూపరిండెంట్‌తో మాట్లాడి మరింత శ్రద్ధ తీసుకొని మెరుగైన వైద్యం అందించాలని తెలియజేశారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం అందించారు.

## ఓట్ల కోసం అణగారిన వర్గాల మధ్య మోడీ చిచ్చు : మట్టుపల్లి

**ప్రజాశక్తి - శ్రీశైలం**

ఓట్ల కోసం అణగారిన వర్గాల మధ్య చిచ్చు పెట్టటం తగదు అని భీమ్ రక్ష ఫెడరేషన్ వ్యవస్థాపకులు మట్టుపల్లి సుబ్బరాయుడు అన్నారు. ఎస్సి వర్గీకరణ పై మూడు దశాబ్దాలుగా పోరాటం చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చిన్న తమ్ముణ్ణి (మందక్రిష్ణ మాదిగ ) ఓదార్చే ప్రయత్నం లో వాస్తవాలను పక్కకు నెట్టి తన మాటల గారడితో నాలుగు సీట్ల కోసం యావత్తు మాదిగ సోదరులను మరోసారి మోసం చేస్తూ అవమానిం చాడని భీమ్ రక్ష పెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా దక్షిణాది రాష్ట్రాల ప్రధాన కార్యదర్శి మట్టుపల్లి సుబ్బరాయుడు అన్నారు. ఎస్సీ వర్గీకరణ న్యాయపరమైనది అయితే అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఏమి చెప్పిందో చెప్పాకుండా దశాబ్ద కాలం నుండి ఎస్సి వర్గీకరణ చేస్తాం అని చెపుతూనే గతంలో ఇచ్చిన లోహర్ కమిషన్ రామ్ చంద్ర కమిషన్ ఉషామెహ్రా కమిషన్ జాతీయ ఎస్సి కమిషన్‌ని పరి గణనలోకి తీసుకోకుండా మరొక కమిటీ వేస్తాను అని చెప్పటం విడ్డురమని అన్నారు. మరోసారి మాదిగ సోదరులను విశ్వరూప సభ సాక్షిగా మోసం చేసిన ఘనత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకే దక్కిందన్నారు.

## గ్రంథాలయ అభివృద్ధికి తోడ్పడాలి

**ప్రజాశక్తి - పగిడ్యాల**

గ్రంథాలయ అబివృద్ధికి గ్రామంలోని ప్రతి ఒక్కరూతో పాటు అందించాలని గ్రంథాలయ అధికారిని కే మద్దమ్మ కోరారు. సోమవారం విలేకరు లతో ఆమె మాట్లాడారు. నేటి నుంచి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ వారోత్సవాలలో, గ్రామ ప్రజలు విద్యార్థులు, మేధావులు పాల్గొని విజయ వంతం చేయాలని ఆమె కోరారు. గ్రంథాలయ అభివృద్ధికి స్థానిక గ్రామ ప్రజల అవసరం ఎంతైనా ఉంది అన్నారు. గ్రామ ప్రజల చేయూతతోనే గ్రంథాలయం అభివృద్ధి చెందుతుందన్నారు.

## వైభవంగా స్వాతి వేడుకలు

**ప్రజాశక్తి - ఆళ్లగడ్డ**

ప్రముఖ పుణ్యక్షేత్రంమైన అహోబిలంలో నరసింహా స్వామి జన్మనక్షత్రం స్వాతి సందర్భంగా ఆదివారం విశేష పూజలు వైభవంగా నిర్వహి ంచారు. ఇందులో భాగంగా ఉత్సవమూర్తులు శ్రీదేవి, భూదేవి, ప్రహ్లాద వరద స్వాములను కొలువుంచి ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. అలాగే క్షేత్రంలోని నవనారసింహ ఆలయాల్లో ప్రత్యేక అభిషేకము, అర్చనలు జరిపారు. భక్తులు నల్లమల అటవీ ప్రాంతంలోని నవ నరసింహ స్వాములను దర్శించుకొని దిగువ అహోబిలంలో నిర్వహించిన స్వాతి వేడుకల్లో పాల్గొన్నారు. స్వాతిని పురస్కరించుకొని దాతలు క్షేత్రంలోని పలు ప్రాంతాల్లో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. దిగువ అహోబిలంలో రంగ మంటపంలో ప్రధాన అర్చకులు వేణుగోపాలన్ ఆధ్వర్యంలో సుదర్శన హోమం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమ ఏర్పాట్లను జిపిఎ సంపత్, ఓఎస్ డి శివప్రసాద్, కమ్యూనికేషన్ ఆఫీసర్ సేతురామన్ పర్యవేక్షించారు.

సుదర్శన హోమం నిర్వహిస్తున్న దృశ్యం

చెక్కును అందజేస్తున్న ఛైర్మన్

## ముఖ్యమంత్రి సహాయనిధి పంపిణీ

**ప్రజాశక్తి-డోన్**

డోన్ పట్టణంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు రూ.45000 కొండపేట సుకన్య భర్త రాజేంద్ర ప్రసాద్‌కు మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్ సోమవారం అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారు ముఖ్యమంత్రి నుంచి ఆర్థిక సహాయం ఇటీవల దరఖాస్తు చేసుకున్నారు. ఆర్థిక శాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి కృషితో బాధితులకు రూ.45 వేలు మంజూరయింది. బాధితుడు రాజేంద్రప్రసాద్ మున్సిపల్ ఛైర్మన్ చేతుల మీదుగా చెక్కు అందుకున్న అనంతరం మాట్లాడుతూ సకాలంలో సహాయం అందించిన ముఖ్యమంత్రి, ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి , మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

### అడవులను సంరక్షించుకుందాం
## వన్య ప్రాణులను కాపాడుకుందాం

**ప్రజాశక్తి - రుద్రవరం**

అడవులను సంరక్షించుకుందాం వన్య ప్రాణుల ను కాపాడుకుందాం అని నూతల ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని టి లింగం దిన్నె గ్రామంలో అడవుల సంరక్షణ, వన్యప్రాణుల ప్రాముఖ్యతను గురించి ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అటవీ అధికారి వినీత్ కుమార్, రుద్రవరం అటవీ క్షేత్రాధికారి బి శ్రీపతి నాయుడు ఆదేశాల మేరకు వన చైతన్య ప్రచార రథం ద్వారా ప్రజలకు అడవులను కాపాడడం, వన్యప్రాణులను రక్షించడం మున్నగు విషయాలు తెలియజేసే కరపత్రాలను పంచారు. రైతులు పొలాల చుట్టూ ఉచ్చులు పెట్టడం గాని, కరెంటు తీగలు పెట్టడం గాని చేయవద్దని, వన్యప్రాణులు గ్రామాలలోనికి వస్తే అటవీ అధికారులకు సమాచారం తెలియజేయాలని వాటికి హాని కలిగించవద్దని, ప్రతి ఒక్కరు ఒక చెట్టు నాటి అటవీ శాతమును పెంచాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో నూతల బీట్ ఆఫీసర్ టీ రామకృష్ణ, సురేంద్ర గౌడుకూప్ మేస్త్రి కిట్టు, చైతన్య రథం డ్రైవర్ పురుషోత్తం, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

గ్రామస్తులకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఫారెస్ట్ సిబ్బంది

## ఫుట్‌బాల్ విజేతలకు బహుమతి ప్రదానం

**ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్**

నందికొట్కూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం నాడు నందికొట్కూర్ ఫుట్ బాల్ ఛాంపియన్ అసోసియేషన్ శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఫుట్ బాల్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి గెలుపొందిన నంద్యాల ఫుట్బాల్ జట్టుకు నందికొట్కూరు పట్టణానికి చెందిన ఎన్. డి. కె అలీ వెంచర్స్ వారు రూ 15 వేల ప్రైజ్ మనీతో పాటు మేమెంటోను క్రీడాకారులకు అందజేశారు. ఈ సందర్భంగా అలీ బ్రదర్స్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని అన్నారు.

విజేతలకు బహుమతి ప్రధానం చేస్తున్న అలీ బ్రదర్స్

## కృత్రిమ మేధకు అపార అవకాశాలు

**ప్రజాశక్తి - పాణ్యం**

కృత్రిమ మేధకు భవిష్యత్తులో అపార అవకాశాలు ఉంటాయని వక్తలు పేర్కొన్నారు. శాంతిరాంలో కంప్యూటర్ విభాగం నందు కొత్తగా మెషీన్ లర్నింగ్ బ్రాంచ్ ఏర్పాటు చేశారు. మండలంలోని శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో నూతనంగా సిఎస్ఈ విభాగంలో ఏఐఎంఎల్ బ్రాంచి ఏర్పాటు చేసినట్లు హెచ్ఓడి రమాదేవి తెలిపారు. సోమవారం కళాశాలలో సిఎస్ఇ విభా గం ఆధ్వర్యంలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఆహ్వానం పలికే కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కొత్తగా కళాశాలలో చేరే విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు ఆదర్శంగా ఉండాలన్నారు. ఈ ఏడాది కళాశాలలో నూతనంగా ఏఐఎంఎల్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మిషన్ లర్నింగ్) బ్రాంచ్ నుకొత్తగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హెచ్ఓడి లు శేషయ్య, ఫరూక్, వీరేష్, మల్లికార్జున, పిడి చంద్రారెడ్డి,అధ్యాపకులు పాల్గొన్నారు.

## టపాసుల దుకాణాలపై కేసులు నమోదు

**ప్రజాశక్తి - బేతంచెర్ల**

బేతంచర్ల పట్టణంలో ఆదివారం నాడు టపాసుల దుకాణాలపై తూనికలు కొలతల శాఖ ఇన్స్పెక్టర్ డోన్ ఎస్.కె కాజా హుస్సేన్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి తూనికల కొలతల అధికారి ఎస్కే కాజా హుస్సేన్, సిబ్బంది కలిసి సందర్భంగా అమ్మకాలు కొనసాగిస్తున్న టపాసులపై ఉన్న తయారీదారి చిరునామా, ప్యాకెట్లపై ఉన్న ఎమ్మార్పీ రేట్లు, కన్స్యూమర్ కేర్ నంబరు పరిశీలించారు. టపాసు ప్యాకెట్లపై ఉన్న వివరాలు లేని తపాసులు, అధిక రేట్లు విక్రయిస్తున్న దుకాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకొని మూడు కేసులునమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

## ఇరిగెలను కలిసిన జనసేన నాయకులు

**ప్రజాశక్తి - ఆళ్లగడ్డ**

పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీ ఇంచార్జ్ ఇరిగెల రాంపుల్లా రెడ్డిని శిరివెళ్ళకు చెందిన జనసేన ముఖ్య నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరిగెల పార్టీ బలో పేతానికి సంబంధించి కార్యక్రమాలపై చర్చించారు. అలాగే చిన్న కంబలూరు గ్రామానికి చెందిన జనసేన నాయకులు బీరప్ప ఆధ్వర్యంలో యువకులు ఇరిగెలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమ ంలో పెసరాయి చాంద్ బాషా నాగరాజు శెట్టి, ఆలమూరు గౌస్, ఇబ్రహీం ఖాన్, మాలి బాషా,జబీవుల్లా, పెసరాయి ఇబ్రహీం, ఖుద్దూస్, నయూమ్, రఫీ,పెద్ద బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇరిగెలను జనసేన నాయకులు

## యాగంటిలో 14 నుంచి కార్తీక మాసోత్సవాలు

**ప్రజాశక్తి - బనగానపల్లె**

మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో ఈనెల 14వ తేదీ నుండి కార్తీక మాస మహోత్సవాలు పారంభం కానున్నట్లు ఆలయ ఈవో చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ ఛైర్మన్ తోట బుచ్చిరెడ్డిలు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్తీక మహోత్సవానికి దేవస్థానంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. కార్తీక మాసం ఈనెల 14 వతేదీ మంగళవారం నుండి డిసెంబర్ 12వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్తీకమాసం మొదటి సోమవారం ఈనెల 20వ తేదీన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఆయన సతీ మణి కాటసాని జయమ్మలు ప్రారంభిం చనున్నట్లు తెలిపారు. ఈనెల 26న కార్తీక పౌర్ణమి సందర్భంగా లక్షత్తుప్తమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించను న్నట్లు తెలిపారు. ఈనెల 27వ తేదీన రెండవ సోమవారం డిసెంబర్ 4వ తేదీన మూడవ సోమవారం డిసెంబర్ 11వ తేదీన నాలుగోవ సోమవారాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజు మహన్యాస పూర్వక రుద్రా భిషేకాలు, కుంకుమార్చన, సహస్ర నామావళి, పల్లకి సేవ నిర్వహించనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 11న కార్తీక మాస ఆఖరి సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు, స్వామివారి పల్లకి సేవోత్సవం, కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్తీకమాసం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వారు తెలిపారు. భక్తులకు శ్రీ ఉమామహేశ్వర నిత్యాన్నదాన సంస్థ, రెడ్ల అన్నదాన సంస్థ, శ్రీ ఉమా మహేశ్వర ఆర్యవైశ్య నిత్యాన్న దాన సంస్థ, యాదవ సమాజ అన్న సత్రం తదితర సంస్థలు భక్తులకు ఉచితంగా కార్తీక మాసంలో భోజన సౌకర్యం కల్పించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరుతున్న వైసీపీ నాయకులు

## వైసిపి నుండి టిడిపిలోకి చేరిక

**ప్రజాశక్తి - బనగానపల్లె**

మండలంలోని చెరువు పల్లె గ్రామానికి చెందిన వైసిపి నాయకులు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరారు. సోమవారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వైసిపి నాయకులు మహేంద్ర యాదవ్, మధుసూదన్ యాదవ్, అఖిల్ యాదవ్, షబ్బీర్ బాష, చంద్రశేఖర్ యాదవ్, సాదిక్, మధు,సుబ్బారాయుడు,శివశంకర్ యాదవ్, ముల్లా ఖాజా, వీరితో పాటు పది కుటుంబాలు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సమ యంలో టిడిపిలో చేరారు. వీరికి మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి టిడిపి కండువాలు కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు.

## బీమా తక్షణ సాయం అందజేత

**ప్రజాశక్తి - బండి ఆత్మకూర్**

మృతుడి కుటుంబానికి వైఎస్ఆర్ బీమా తక్షణ సాయంను మండలంలోని ఎర్రగుంట్ల గ్రామంలో సర్పంచ్ కాలూరు శ్వేత కుమారి ఆధ్వర్యంలో అందజేశారు. ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన కోనేటి పుల్లయ్య (44) అనారోగ్యంతో కర్నూల్ సర్వజన ఆస్పత్రి నందు చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ కాలూరు శ్వేత కుమారి, వైకాపా నాయ కులు కాలూరు ప్రసాద్ తదితరులు మృతుడి కుటుంబానికి పదివేల తక్షణ సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా కాలూరు ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి కుటుంబము వైయస్సార్ జీవిత బీమా చేయించుకోవాలని ఇంకా గ్రామంలో ఎవరైనా చేయించుకోని వారు వెంటనే చేయించుకో వాలని సూచించారు. పేద కుటుంబాలకు వైయస్సార్ బీమా వరం లాంటిదని వారు తెలిపారు.

తక్షణ సహాయం అందిస్తున్న దృశ్యం

## వైసిపి హయాంలో ప్రజల భవిష్యత్తు అంధకారం : టిడిపి

గజమాలతో సత్కరిస్తున్న టిడిపి నాయకులు

**ప్రజాశక్తి -ప్యాపిలి**

వైసిపి ప్రభుత్వం హయాంలో రాష్ట్ర ప్రజల భవిష్యత్తు, పిల్లల భవిష్యత్తు నాశనమైందని నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి వై నాగేశ్వరరావు యాదవ్ పేర్కొన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీలో భాగంగా నల్లమే కులపల్ల గ్రామంలో కార్యక్రమం నిర్వహించారు. మినీ మ్యానిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాటమయ్య, వలసల రామకృష్ణ, మురళీకృష్ణ గౌడ్, బట్ట సత్యం, రాజశేఖర్, రాఘవేంద్ర, ప్రసాద్ రెడ్డి,సుదర్శన్, రామసుబ్బయ్య, ఖాజా పీర్ తదితరులు పాల్గొన్నారు.

**గెలుపే లక్ష్యంగా పనిచేయాలి**

**- టిడిపి మండల కన్వీనర్ వున్నం ఎల్ల నాగయ్య.**

**బేతంచెర్ల** : రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికా రంలోకి రావడం ఖాయం కనుక ప్రతి కార్యకర్త నాయకుడు గెలుపే లక్ష్యంగా పనిచేయాలని తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య అన్నారు. ఆదివారం నాడు మండల పరిధిలోని గొర్ల గుట్ట గ్రామంలో బూత్ 290,291 బూత్ కన్వీనర్ వెంకట సత్యం, కృష్ణ అధ్యక్షతన బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్ర మం నిర్వహించారు. బేతంచెర్ల మండల కన్వీనర్ ఉన్నం ఎల్లా నాగయ్య మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని ప్రతి కార్యకర్త నాయకుడు తెలుగుదేశం పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రామాంజనేయులు, రామనాథం, నాయకులు సుంకన్న, గోపాల్ రెడ్డి, బొల్లవరం పద్మనాభరెడ్డి, వెంకటరామిరెడ్డి, బ్రహ్మయ్య ఆచారి, లోకేష్ రెడ్డి, పద్మనాభుడు , ఆల చిన్న మద్దిలేటి, వెంకటరమణ, కౌన్సిలర్ రామాంజనేయులు, బెల్లం రామనాథం, సుంకన్న, తదితరులు పాల్గొన్నారు.

మేనిఫెస్టోను వివరిస్తున్న టిడిపి మండల కన్వీనర్ వున్నం ఎల్ల నాగయ్య

DHONE MUNICIPALITY
E-Procurement Tender Notice
Dhone Municipality, R.S Road, Dhone,
Telephone No 08516 - 223281,
e-mail id: mc.dhone@cdma.gov.in
E-Tender :
**Tender Notification No:-** 12/General Fund/2023-24/E1, Dt.13/11/2023 of Dhone Municipality.

| | |
|---|---|
| **Name of the Grant** | General Fund 2023-24. |
| **No. of works** | 1 No 1st Call |
| **Last date and time of receipt of Tenders** | 29.11.2023 Time: 05:30 P.M |

E-Tender Website: https://tender.apeprocurement.gov.in
E-Mail ID for Clarifications / Communication: mc.dhone@cdma.gov.in
**Note:** Any addendum / corrigendum / bid clarifications / time extension shall be issued on the website only. No separate press notification shall be issued.
Contact: No's: 9949588370 & 9949588373.
Further details can be seen @e-procurement market place at www.tender.apeprocurement.gov.in.
Sd/-(R.Venkatarami Reddy)
Commissioner
Dhone Municipality